FOR ADS......
ఆకాంక్ష
CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :210 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 24 - మార్చి - 2026

# ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..



**రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.**

**రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది.**

అమరావతి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో, లక్ష మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. మిగతా..2లో

# ట్రంప్‌తో మేం చర్చలు జరపలేదు... చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు



**చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు అని విమర్శించింది.**

**యుద్ధ నివారణ కోసం గల్ఫ్ దేశాలు చొరవ తీసుకున్నాయని, అయితే తాము చర్చల ప్రతిపాదను తిరస్కరించామని ఇరాన్ స్పష్టం చేసింది.**

ఢిల్లీ :అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. ఇరాన్‌పై సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఆ ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ట్రంప్‌తో తాము ఎలాంటి చర్చలూ జరపలేదని, తమ హెచ్చరికలతోనే ఆయన వెనక్కి తగ్గారని స్పష్టం చేసింది. చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు అని విమర్శించింది. యుద్ధ నివారణ కోసం గల్ఫ్ దేశాలు చొరవ తీసుకున్నాయని, అయితే తాము చర్చల ప్రతిపాదను తిరస్కరించామని ఇరాన్ స్పష్టం చేసింది. అసలు చొరవ తీసుకోవాల్సిందీ, యుద్ధ విరమణ ప్రతిపాదన చేయాల్సిందీ యుద్ధం ప్రారంభించిన దేశం (ఇజ్రాయెల్) అని ఇరాన్ ఉద్ఘాటించింది. మిగతా..2లో

## ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా ఇస్తున్నారు: హరీశ్ రావు ఆగ్రహం



- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారని ఆరోపించారు.
- ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని విమర్శించారు.

హైదరాబాద్: ఏవైనా ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన శాసనసభలో మాట్లాడుతూ,

# హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

- హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.
- నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.
- త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు.



పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మిగతా..2లో

## అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క

- ★ గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు.
- ★ ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు.
- ★ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.



హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఏ బకాయిల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో మిగతా..2లో

## ప్రభుత్వ అధినేతగా మోదీ రికార్డ్.. అభినందించిన చంద్రబాబు, పవన్, జగన్



- భారత ప్రధానిగా మొత్తం 8,931 రోజులు నిరంతరాయంగా ప్రభుత్వ అధినేతగా సేవలు అందించడంపై ప్రధానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
- 'ఆయన ప్రస్థానం కేవలం పదవీకాలానికి సంబంధించింది కాదు. ఇది తిరుగులేని సంకల్పం, అలుపెరగని అంకితభావం,

ఢిల్లీ : భారతదేశంలో ప్రభుత్వ అధినేతగా సుదీర్ఘకాలం పనిచేసిన వ్యక్తిగా ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక రికార్డు

# రైతు రుణమాఫీ ప్రతిపాదన కేంద్రం పరిశీలనలో లేదు

- ❖ పార్లమెంటుకు చెప్పిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ❖ రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని వెల్లడి



ఎలాంటి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. అయితే, రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, వాటిలో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా సకాలంలో తగినంత రుణం అందించడం కూడా ఉందన్నారు. ఈ కేసీసీ కింద రూ. 3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లకు అందిస్తున్నామని తెలిపారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసిన ప్రాధాన్య రంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా, పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ. 1.60 లక్షల నుంచి రూ. 2 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. అలాగే వ్యవసాయంతో సహా ఆర్థిక వ్యవస్థలోని మిగతా..2లో

# 5 రోజులు దాడులు చేయబోమని ట్రంప్ కీలక ప్రకటన

- ❖ ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై 5 రోజుల వరకూ దాడులు చేయం : ట్రంప్
- ❖ ఇంధన మౌలిక వసతులపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు.

**వార్నింగ్ లకు భయపడిపోయారని ఇరాన్ ఎద్దేవా**



ఢిల్లీ : ఇరాన్‌పై దాడులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల గడువుపై వెనక్కి తగ్గారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో చర్చలు ఫలవంతంగా జరగడంతో దాడులను విద్యుత్, ఇంధన సదుపాయాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై స్పందించిన ఇరాన్ ట్రంప్ భయపడ్డారని ఎద్దేవా చేసింది. తాము ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి చర్చలు జరపలేదని స్పష్టంచేసింది. మిగతా..2లో

## ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...



- రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్
- రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ కీలకం కానుంది.
- నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది.

అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి సమీపంలోని రాజయ్యపేటలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు

# గుట్టల గుండెలు కోస్తున్న అక్రమ మట్టి మాఫియా...

- అక్రమ తవ్వకాలతో పర్యావరణానికి ముప్పు.. ప్రభుత్వానికి నష్టం...
- ఎల్లమ్మ గుట్ట, దనగుట్టలపై అక్రమార్కుల కన్ను...
- కాల్వశ్రీరాంపూర్, ఓదెలలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు...
- గుట్టల దోపిడీ ఆపాలని కలెక్టర్‌కు బీసీ సంఘం నేత వినతి...









పెద్దపల్లిటౌన్//మార్చి 23 (ఆకాంక్ష): పెద్దపల్లి జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, ప్రకృతి సంపదైన గుట్టలను అక్రమార్కులు నిర్దాక్షిణ్యంగా కొల్లగొడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో పాల్గొని, జిల్లా కలెక్టర్‌తో పాటు మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అధికారిక ఫిర్యాదు అందజేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా మట్టి,మొరాన్ని తవ్వి తరలిస్తున్న ఘటనలు విస్తృతంగా జరుగుతున్నప్పటికీ, వాటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖలు నిష్క్రియంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎల్లమ్మ గుట్ట, ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామ పరిధిలో ఉన్న దన గుట్టలను లక్ష్యంగా చేసుకుని అక్రమ తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయని ఫిర్యాదులో వివరించారు. రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లతో గుట్టల నుంచి మొరాన్ని తరలిస్తున్నారని, ఈ దోపిడీ కారణంగా ప్రకృతి వైభవం నశిస్తూ గుట్టలు క్రమంగా నామరూపాలు లేకుండా మారుతున్నాయని స్వామి వివేక్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరమైన అనుమతులు లేకుండా నిబంధనలను తుంగలో తొక్కుతూ జరుగుతున్న మిగతా..2లో

## ఆ 30 నిమిషాల జూమ్ కాల్

# ఏపీ తలరాతనే మార్చేసింది

- "2019 జనవరిలో దావోస్‌లో ఆదిత్య మిట్టల్‌ను కలవడానికి ప్రయత్నించాను.
- నేను పట్టుదలతో, ఒకవేళ మీ ప్రాజెక్టు అక్కడ కార్యరూపం దాల్చకపోతే, ఆంధ్రప్రదేశ్ మీకోసం సిద్ధంగా ఉంటుందని చెప్పాను.
- 'నాకు సంక్షేమ పథకాలు వద్దు, నా పిల్లలకు ఉద్యోగాలు కల్పించండి, చాలు' అని ఆమె చెప్పిన మాట నా ప్రయాణమంతా నన్ను వెంటాడింది.



అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా రాజయ్యపేట వద్ద ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఈ ప్రాజెక్టును సాధించడం వెనుక ఉన్న సుదీర్ఘ ప్రయాణాన్ని, పట్టుదలను వివరిస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు హెచ్.డి. కుమారస్వామి, శ్రీనివాస వర్మ, ఆర్సెలర్ మిట్టల్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఈ భూమిపూజ కేవలం ఒక పరిశ్రమకు శంకుస్థాపన కాదని, ఇది ఆంధ్రప్రదేశ్ పై, భారతదేశంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## గుట్టల గుండెలు కోస్తున్న అక్రమ మట్టి మాఫియా...

ఈ తవ్వకాల వల్ల పర్యావరణ సమతౌల్యం తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాల ప్రభావం కేవలం ప్రకృతి నాశనంతోనే పరిమితం కావడం లేదని, ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల రాయల్టీ ఆదాయం కూడా పక్కదారి పడుతోందని ఆయన తెలిపారు. ఒకవైపు ప్రభుత్వ ఆదాయం దెబ్బతింటుంటే, మరోవైపు అక్రమంగా తవ్విన మట్టిని కొంత మంది రియల్ ఎస్టేట్ వెంచర్లలో వినియోగిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం చట్ట విరుద్ధ చర్య మాత్రమే కాకుండా, ప్రజా సంపదను కొల్లగొట్టే దోపిడీ చర్యగా అభివర్ణించారు. జిల్లా యంత్రాంగం ఇకనైనా అప్రమత్తమై కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో తక్షణ క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునేలా చెక్‌పోస్టులు, నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. తవ్వకాల్లో పాల్గొంటున్న వారిపై మాత్రమే కాకుండా, వీరికి సహకరిస్తున్న బాధ్యులపైనా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి సంపదను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గుట్టలు, చెరువులు, అడవులు వంటి వనరులను కాపాడకపోతే భవిష్యత్ తరాలకు తీవ్రమైన నష్టం తప్పదని స్వామి వివేక్ పటేల్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ ఆదాయం సంరక్షణ, భూసంపద రక్షణ దృష్ట్యా అక్రమ మట్టి తవ్వకాలపై జిల్లా అధికారులు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే దానిపై స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అక్రమ తవ్వకాలతో బాధపడుతున్న గ్రామాల ప్రజలు కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రకృతి దోపిడీకి అడ్డుకట్ట వేసి, చారిత్రక మరియు సహజ వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్... శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామి

చేయనున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు నేటి సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ కీలకం కానుంది. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిట్టల్ అధినేత లక్ష్మీ మిట్టల్, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం వారు శిలాఫలకం ఆవిష్కరించారు. అంతకుముందు, స్టీల్ ప్లాంట్ నిర్మాణ నమూనాను లక్ష్మీ మిట్టల్.. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కుమారస్వామికి వివరించారు. అనంతరం, నేతలందరూ ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించారు. రాజయ్యపేటలో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2029 నుంచి ఉత్పత్తిని ప్రారంభించాలని కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ భారీ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చగలదని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## ప్రభుత్వ అధినేతగా మోదీ రికార్డ్.. అభినందించిన చంద్రబాబు, పవన్, జగన్

సృష్టించారు. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారమే ప్రధానిని అభినందించిన విషయం తెలిసిందే. ఈ అసాధారణ మైలురాయిపై పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా మొత్తం 8,931 రోజులు నిరంతరాయంగా ప్రభుత్వ అధినేతగా సేవలు అందించడంపై ప్రధానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "ఆయన ప్రస్థానం కేవలం పదవీకాలానికి సంబంధించింది కాదు. ఇది తిరుగులేని సంకల్పం, అలుపెరగని అంకితభావం, భారత సేవకే అంకితమైన జీవితం. అట్టడుగు స్థాయి నాయకత్వం నుంచి ప్రపంచ వేదికపై దేశానికి మార్గనిర్దేశం చేసే వరకు, 'దేశమే ప్రథమం' అనే స్పష్టమైన దార్శనికతతో ఆయన పాలనను పునర్నిర్వచించారు" అని పవన్ కల్యాణ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఆయన నాయకత్వం క్రమశిక్షణ, త్యాగం, అసమానమైన పనితీరుకు నిదర్శనమని, దేశ మౌలిక సదుపాయాల బలోపేతం, పేదల సాధికారత, డిజిటల్ విప్లవం, ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్ఠను పెంచడం వంటి అంశాలు లక్షలాది మందికి స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి కూడా ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. "ప్రభుత్వ అధినేతగా 8,931 రోజులు పూర్తి చేసుకుని, ప్రజాసేవలో చారిత్రక మైలురాయిని నెలకొల్పిన ప్రధాని నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక అభినందనలు. ఈ ఘనత ఒక వ్యక్తి సంకల్పానికి, దృఢచిత్తానికి నిదర్శనం.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క

ఉంచుకుని ఈ బకాయిలను మానవతా కోణంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.

## ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా ఇస్తున్నారు: హరీశ్ రావు ఆగ్రహం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని అన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారని ఆరోపించారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. గత రెండు బడ్జెట్‌లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారని గుర్తు చేశారు. కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో చెప్పి ఈసారి ఆ ప్రస్తావన కూడా తేలేదని విమర్శించారు.

## ట్రంప్‌తో మేం చర్చలు జరపలేదు... చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు: ఇరాన్ ప్రకటన

ఇవాళ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఒక ప్రకటన చేశారు. "గత రెండు రోజులుగా ఇరాన్‌తో జరిపిన చర్చలు ఫలప్రదంగా సాగాయి. అందుకే ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని రక్షణ శాఖను ఆదేశించాను. ఈ చర్చల ఫలితాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయి" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్ దీనిపై ఘాటుగా స్పందించింది. అమెరికాతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంప్రదింపులు జరగలేదని ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు తేల్చిచెప్పాయి. ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. తమ హెచ్చరికల కారణంగానే ట్రంప్ వెనక్కి తగ్గారని, తన ఓటమిని కప్పిపుచ్చుకోవడానికే చర్చల నాటకం ఆడుతున్నారని ఇరాన్ వర్గాలు ఆరోపించాయి. గతంలో విధించిన 48 గంటల గడువు ముగుస్తుండటంతో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఒకవైపు చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ చెబుతుండగా, మరోవైపు ఇరాన్ ఖండిస్తుండటంతో గందరగోళం నెలకొంది. మరోవైపు, ట్రంప్ ప్రకటన ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి.

## ఏపీపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు..

ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దీని ద్వారా ఏటా 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించడం అనేది ఈ ప్రాంత యువతకు గొప్ప వరం. ఆంధ్రప్రదేశ్‌పై, మా ఎన్డీయే ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇంత భారీ పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చినందుకు ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, సీఈఓ దిలీప్ ఉమెన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను"

# ఆ 30 నిమిషాల జూమ్ కాల్ ఏపీ తలరాతనే మార్చేసింది

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న తన ప్రయత్నాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "2019 జనవరిలో దావోస్‌లో ఆదిత్య మిట్టల్‌ను కలవడానికి ప్రయత్నించాను. కానీ ఆయన నాకు సమయం ఇవ్వలేదు. అయినా పట్టువదలలేదు. టాటా గ్రూప్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన్ను కలిసి, ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టకూడదని అడిగాను. అప్పటికే తాము ఇతర రాష్ట్రాలను పరిశీలిస్తున్నామని ఆయన వినయంగానే అయినా నిక్కచ్చిగా చెప్పారు. అయినా నేను పట్టుదలతో, ఒకవేళ మీ ప్రాజెక్టు అక్కడ కార్యరూపం దాల్చకపోతే, ఆంధ్రప్రదేశ్ మీకోసం సిద్ధంగా ఉంటుందని చెప్పాను. అది కేవలం ఆత్మవిశ్వాసం కాదు, మాకున్న దృఢ సంకల్పం" అని లోకేశ్ వివరించారు. సంవత్సరాలు గడిచాయని, 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుత విజయాన్ని అందించి, మరోసారి సేవ చేసే అవకాశం కల్పించారని లోకేశ్ తెలిపారు. "తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రోజు కూడా వృథా చేయకుండా వేగంగా పనులు ప్రారంభించాం. 2024 సెప్టెంబర్ 22, ఆదివారం రాత్రి 8:30 గంటలకు ఆదిత్య మిట్టల్‌తో నేను చేసిన



30 నిమిషాల జూమ్ కాల్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును శాశ్వతంగా మార్చివేసిందని నేను నమ్ముతున్నాను. ఆ కాల్ ఫలితంగానే, భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ పెట్టుబడులలో ఒకదాన్ని మనం సాధించగలిగాం. ఇదే వ్యాపార సౌలభ్యం అంటే.. ఇదే నూతన ఆంధ్రప్రదేశ్" అని లోకేశ్ గర్వంగా ప్రకటించారు. తన పాదయాత్ర అనుభవాన్ని పంచుకుంటూ, "2023లో రాష్ట్రవ్యాప్తంగా 3,132 కిలోమీటర్ల పాదయాత్ర చేశాను. గంగాధర నెల్లూరులో మోహన అనే రోడ్డు పక్కన బజ్జీలు అమ్ముకునే మహిళను కలిశాను. ఆమె గత 30 ఏళ్లుగా అక్కడే బజ్జీలు అమ్ముతూ, భర్తను మద్యానికి కోల్పోయినా, సంపాదించిన ప్రతి రూపాయిని కూడబెట్టి ఇద్దరు పిల్లలను చదివించింది. 'మీకు నేనేం చేయాలి?' అని అడిగితే, 'నాకు సంక్షేమ పథకాలు వద్దు, నా పిల్లలకు ఉద్యోగాలు కల్పించండి, చాలు' అని ఆమె చెప్పిన మాట నా ప్రయాణమంతా నన్ను వెంటాడింది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని మేం ఇచ్చిన హామీకి ఆ తల్లే స్ఫూర్తి" అని లోకేశ్ భావోద్వేగంగా చెప్పారు. ఈరోజు ఈ భూమిపూజ కార్యక్రమం తనకు చాలా ప్రత్యేకమని, ఆంధ్రప్రదేశ్ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోగలుగుతున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. "కఠోర శ్రమ, పట్టుదల, నమ్మకం వల్లే ఇది సాధ్యమైంది. ఇప్పుడు మనం ఇప్పటికే స్థిరపడిన రాష్ట్రాలతో పోటీ పడుతూ, దేశంలోనే నంబర్ వన్ పెట్టుబడుల గమ్యస్థానంగా మారాం. ప్రపంచ స్థాయి కార్పొరేట్లను ఆకర్షించి, రికార్డు సమయంలో భూములు అప్పగించి, ప్రాజెక్టులు ప్రారంభించే మా సామర్థ్యానికి ఈ భూమిపూజే నిదర్శనం. అత్యాధునిక టెక్నాలజీ, హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగిన ఈ స్టీల్ ప్లాంట్ రాష్ట్రానికి వస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఒకటి" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# 5 రోజులు దాడులు చేయబోమని ట్రంప్ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

ట్రంప్ నిర్ణయంతో ముడిచమురు ధర అమాంతం పడిపోయింది. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌కు విధించిన 48 గంటల డెడ్‌లైన్‌ను ట్రంప్ వాయిదా వేశారు. ఇరాన్‌లోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇంధన మౌలిక వసతులపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమాసియాలో తమ మధ్య ఉన్న శత్రుత్వాలకు సమగ్ర పరిష్కారం కనుగొనే దిశగా అమెరికా, ఇరాన్ గత రెండ్రోజులుగా ఫలవంతమైన చర్చలు జరిపాయని తెలియజేశారు. ఈ వారం అంతటా తమ మధ్య లోతైన, సవివరమైన, నిర్మాణాత్మక చర్చలు కొనసాగనున్నాయని పోస్టుచేశారు. సానుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై జరపాల్సిన అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని యుద్ధ శాఖను ఆదేశించానని పేర్కొన్నారు. అయితే, పూర్తి నిర్ణయం మాత్రం ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చల ఫలితాలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ఈ విషయంపై మీరు శ్రద్ధ చూపినందుకు ధన్యవాదాలు అంటూ ట్రంప్ రాసుకొచ్చారు. అటు తమ హెచ్చరికలతో ట్రంప్, భయపడిపోయారని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది. యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. పర్షియన్ గల్ఫ్ అంతటా మైన్‌లు పెడతామని, గల్ఫ్‌లోని విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని తాము చేసిన హెచ్చరిక వల్లే ఆయన వెనక్కి తగ్గారని పేర్కొంది. నిర్మాణాత్మక చర్చలు జరిగాయన్న ట్రంప్ వాదనను తిరస్కరించింది. ట్రంప్‌తో ప్రత్యక్షంగా గానీ మధ్యవర్తుల ద్వారా గానీ ఎలాంటి చర్చలు జరగలేదని పేర్కొంది. అటు ఇరాన్ సైన్యం కూడా ట్రంప్‌ను ఎద్దేవా చేసింది. హే ట్రంప్, నిన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నామంటూ ఖతమ్ అల్-అన్బియా కేంద్ర ప్రధాన కార్యాలయ ప్రతినిధి ఇబ్రహీం జొల్ఫఘారి ఎగతాళి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంపై మీరు శ్రద్ధ చూపినందుకు ధన్యవాదాలు అంటూ ట్రంప్ చేసిన పోస్టును ఉటంకిస్తూ జొల్ఫఘారి ఒక వీడియో



క్లిప్ విడుదల చేశారు. మరోవైపు ఇరాన్ విద్యుత్, ఇంధన సదుపాయాలపై దాడులను ఐదు రోజులు వాయిదా వేస్తామని ట్రంప్ ప్రకటన చేయగానే ఇంధన ధరలు అమాంతం పడిపోయాయి. బ్యారెల్ ముడి చమురు ధర 13 శాతం, అంటే సుమారు 17 డాలర్లు తగ్గి 96 డాలర్లకు చేరుకుంది.

# రైతు రుణమాఫీ ప్రతిపాదన- కేంద్రం పరిశీలనలో లేదు

మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. వీటితోపాటు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు సాయుధ దళాల్లో పని చేస్తూ తీవ్రమైన వైకల్యం సంభవించి సర్వీస్ నుంచి వైదొలగిన సైనికులు పొందే వైకల్య పింఛనుకు ఆదాయపు పన్ను మినహాయింపుపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆ పన్ను మినహాయింపును నిలిపివేయడం లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఇంతకుముందు ఉన్న మినహాయింపు, దాని పరిధిని షరతులతో సహా కొనసాగేలా చూసేందుకే ప్రస్తుత నిబంధనను చేర్చినట్లు ఆమె వివరించారు. "2025 ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి రావడంతో 1922 ఆదాయపు పన్ను చట్టానికి సంబంధించిన మినహాయింపు నిబంధనలు అమలులో లేకుండా పోయాయి. అందువల్ల, కొత్త చట్టంలో స్పష్టమైన నిబంధన లేనందున మినయింపు రద్దయి ఉండేది.



అందుకే దానిని కొనసాగించేలా కొత్త నిబంధనను ఇందులో చేర్చాం." అని ఆర్థిక మంత్రి అన్నారు. 2026 జనవరి 31 నాటికి వైకల్యంతో సాయుధ దళాల సర్వీస్ నుంచి పదవీ విరమణ చేసిన సాయుధ దళాల సిబ్బంది సంఖ్య 1,47,263గా ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. వైకల్యం కారణంగా సర్వీస్ తొలగించి పింఛను పొందుతున్న సాయుధ దళాల సిబ్బంది 89,598 మంది అని ఆమె వివరించారు. సాయుధ దళాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి ఏటా వైద్యపరమైన అర్హత పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో వ్యాధులు, వైకల్యాలు, గాయాలు, వైద్యపరమైన సమస్యలు ఉన్న సిబ్బందిని గుర్తిస్తారని చెప్పారు. ఆ తర్వాత వారి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వర్గీకరిస్తారని వివరించారు. ఈ వార్షిక వైద్య పరీక్షలో సాధారణ శారీరక, వ్యవస్థాగత పరీక్షతో పాటు అనేక ఇతర పరీక్షలు కూడా ఉంటాయన్నారు. ఈ పరీక్షలు ఆయా సర్వీసులో, అధికారి పాత్ర ఆధారంగా వేర్వేరుగా ఉంటాయని ఆమె చెప్పారు. "శాశ్వత వైద్య వర్గీకరణలో ఉన్న సిబ్బంది, ఒకవేళ సైనిక విధుల నిర్వహణకు అనర్హులుగా తేలితే 'ఇన్వాలిడేటింగ్ మెడికల్ బోర్డు' ద్వారా వైద్యపరమైన కారణాలతో సేవ నుంచి తొలగిస్తారు. ఈ ఇన్వాలిడేటింగ్ మెడికల్ బోర్డులు +మీా-2023 నిబంధనలకు అనుగుణంగా సదరు వ్యక్తుల్లోని వైకల్య స్థాయిని అంచనా వేస్తాయి. ఆ వైకల్యానికి సంబంధించిన అర్హతలను జు=-2023, +మీా-2023 ప్రకారం సంబంధిత సర్వీస్ ప్రధాన కార్యాలయాలు నిర్ణయిస్తాయి." అని ఆమె తెలిపారు. వైద్య బోర్డులు కేవలం సదరు వ్యక్తి వైద్య పరిస్థితిని, చికిత్సకు అవసరమైన వివిధ ఉద్యోగపరమైన పరిమితులను మాత్రమే నిర్దేశిస్తాయని మంత్రి చెప్పారు.

# ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటోన్న ప్రజల సమస్యలను సత్వర పరిష్కారంపై సీఎం చర్చించి ఆదేశాలిచ్చినట్లు వివరించారు. కేంద్ర ఆయిల్ కంపెనీలు, ప్రైవేటు గ్యాస్ సరఫరాదారులతోనూ సీఎం చర్చించారని వెల్లడించారు. గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు : గ్యాస్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, గ్యాస్ కొరతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన పలు చర్యలపై సీఎం దిశానిర్దేశం చేసినట్లు మంత్రి పార్థసారథి వివరించారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 9981 హెక్టార్లలో వ్యవసాయ, 1388 హెక్టార్లలో హార్టీకల్చర్ పంటలకు నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేయగా ఈనెల 31 లోపు కలెక్టర్ల ద్వారా పంట నష్టం వివరాలన్నీ సమగ్రంగా ప్రభుత్వానికి చేరాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ తో మెరుగైన సేవలు : మొక్క జొన్న



రైతులకు గిట్టుబాటు ధర కల్పన కోసం చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అలాగే కేంద్రం నుంచి నష్ట పరిహారం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు మంత్రి వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ ను ఎక్కువగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి పార్థసారథి వివరించారు. "యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాం. ఆయిల్ కంపెనీలు, గ్యాస్ సరఫరాదారులతో సీఎం చర్చించారు. గ్యాస్ ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. గ్యాస్ కొరత అధిగమించేందుకు సీఎం సూచనలు చేశారు. ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించాలని సీఎం సూచించారు. ప్రజలు పైప్డ్ గ్యాస్‌కు మారేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కంగారుపడాల్సిన పనిలేదు, అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. సుమారు 15 వేల మంది రైతులు నష్టపోయారు. సుమారు 11,500 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. ఈనెల 31లోపు పంట నష్టం వివరాలు అందించాలని ఆదేశించాం. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లకోసం 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇళ్లు పొందేందుకు 6.5లక్షల మందికి అర్హత ఉన్నట్లు గుర్తించాం. ఇంటి నిర్మాణ యూనిట్ కాస్ట్ పట్టణాల్లో రూ.2.5 లక్షలు, గ్రామాల్లో రూ.2.39 లక్షలుగా నిర్ణయించాం.

# *తమిళనాడులో డీఎంకే కూటమికి 180 సీట్లు- అన్నాడీఎంకే అలయెన్స్ 54 స్థానాలకే పరిమితం*

త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు- ముమ్మరంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటములు, టీవీకే ప్రచారం- ఈ క్రమంలో విపక్ష అన్నాడీఎంకే కూటమికి షాక్ ఇచ్చిన 'అగ్ని న్యూస్ సర్వీస్' సర్వే- డీఎంకేదే అధికారమని అంచనా

త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే కూటమి ప్రభంజనం సృష్టించనుందని చెన్నై కేంద్రంగా పనిచేసే 'అగ్ని న్యూస్ సర్వీస్' అనే సర్వే సంస్థ పేర్కొంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 44.9శాతం ఓట్లను సాధిస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో 180 స్థానాలను అధికార కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. విపక్ష అన్నాడీఎంకే కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తగలనుందని సర్వే సంస్థ వెల్లడించింది. ఈ కూటమి 38.5శాతం ఓట్లను సాధించి, 54 సీట్లకే పరిమితమయ్యే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది.

### అన్నాడీఎంకేకి షాక్!

అన్నాడీఎంకే కూటమికి ఈ ఎన్నికల్లో చెన్నై రీజియన్‌లో ఎదురుదెబ్బ తగలనున్నట్లు 'అగ్ని న్యూస్ సర్వీస్' అనే సర్వే సంస్థ అంచనా వేసింది. ఆ ప్రాంతంలో ఒక్క సీటు కూడా అన్నాడీఎంకే కూటమి గెలవదని పేర్కొంది. మధ్య తమిళనాడు ప్రాంతంలో పళనస్వామి నేతృత్వంలో కూటమి కేవలం 2 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని వెల్లడించింది. దీంతో అన్నాడీఎంకే కూటమి మరోసారి భారీ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

టీవీకే ప్రభావం అంతంతమాత్రమే!

సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో అంతంతమాత్రమే ప్రభావితం చూపిస్తుందని సర్వే సంస్థ 'అగ్ని న్యూస్ సర్వీస్' అంచనా వేసింది. 9.7శాతం ఓట్లను టీవీకే సాధిస్తుందని వెల్లడించింది. అలాగే, సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కచ్చి పార్టీ 4.8శాతం ఓట్ల వాటాను పొందే ఛాన్స్ ఉందని, ఇతర పార్టీలు కలిపి 2.1శాతం ఓట్లను దక్కించుకుంటాయని సర్వే సంస్థ పేర్కొంది. రాబోయే ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్, నామ్ తమిళర్ కచ్చి పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ ఇద్దరూ ఓటమిని చవిచూసే అవకాశం ఉందని అంచనా వేసింది.

### అన్ని ప్రాంతాల్లో డీఎంకే హవా

తమిళనాడులోని అన్ని ప్రాంతాల్లోనూ డీఎంకే కూటమి హవా వీస్తుందని సర్వే సంస్థ పేర్కొంది. దక్షిణ తమిళనాడులో 58 నియోజకవర్గాలకుగానూ డీఎంకే కూటమి 42, మిగతా 16 స్థానాల్లో అన్నాడీఎంకే కూటమి జోరు కనబరుస్తున్నట్లు వెల్లడించింది. మధ్య తమిళనాడులోని 37 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి హవా 35 చోట్ల కనిపిస్తుండగా, అన్నాడీఎంకే కూటమి కేవలం రెండు స్థానాల్లోనే దూకుడు ప్రదర్శిస్తోందని పేర్కొంది. పశ్చిమ తమిళనాడులోని 50 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి 32, అన్నాడీఎంకే అలయెన్స్ 18 స్థానాల్లో ముందంజలో ఉన్నాయని స్పష్టం చేసింది. ఉత్తర తమిళనాడులో డీఎంకే కూటమి 35, అన్నాడీఎంకే కూటమి 17 స్థానాల్లో ఆధిక్యం కనబర్చుతున్నట్లు పేర్కొంది. అలాగే చెన్నై రీజియన్‌లో డీఎంకే కూటమి హవా నడుస్తుందని అంచనా వేసింది.

'టీవీకే నాయకులు కల్పిత ప్రపంచంలో విహరిస్తున్నారు'

తమ సంస్థ సర్వే అంచనాలపై చెన్నై ప్రెస్ క్లబ్‌లో అగ్ని న్యూస్ సర్వీసెస్ సీఈఓ ఆర్. సురేశ్ కుమార్ మాట్లాడారు. టీవీకే నాయకులు



ఒక కల్పిత ప్రపంచంలో విహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. పెరంబూరు నియోజకవర్గంలో విజయ్ ఓటమి పాలవుతారని అన్నారు. ఆయన పోటీ చేసిన రెండో స్థానంలో విజయం సాధిస్తారని అంచనా వేశారు. అలాగే, నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ కారైకుడి నియోజకవర్గంలో ఓడిపోతారని వెల్లడించారు.

### 'మహిళా ఓటర్ల మద్దతు డీఎంకే కూటమికే'

"డీఎంకే పాలన పట్ల మహిళలు సంతృప్తిగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో 60 శాతానికి పైగా మహిళా ఓటర్లు డీఎంకే కూటమికి మద్దతు తెలిపే అవకాశం ఉంది. మహిళల కోసం డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎన్నికల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. 49 శాతం మంది మహిళలు తమిళనాడును ఒక సురక్షితమైన రాష్ట్రంగా భావిస్తున్నారు. కలైంగర్ పథకం కింద డీఎంకే సర్కార్ మహిళకు ఇచ్చిన రూ.5,000 ఆర్థిక సహాయం ఎన్నికల్లో ప్రభావం చూపుతుంది" అని ఆర్.సురేశ్ కుమార్ తెలిపారు. కాగా, 234 స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, టీవీకే మధ్యే ఉండే అవకాశం ఉంది.

## కివీస్ గడ్డపై టీ20 లీగ్ సందడి..

## ఐపీఎల్ తరహాల్లో గ్లీ20ని ప్రకటించిన న్యూజిలాండ్ క్రికెట్

జనవరి 2027 నుంచి న్యూజిలాండ్ తన సొంత టీ20 లీగ్ ఘ్లీ20ని ప్రారంభించనుంది. 6 జట్లు, ప్రైవేట్ ఓనర్లతో ఐపీఎల్ తరహాలో ఈ టోర్నీ జరగనుంది. మహిళల క్రికెట్ లీగ్ కూడా దీనిలో భాగంగా ఉంటుంది.



భారతదేశంలో ఐపీఎల్ సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు అదే బాటలో ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల హవా నడుస్తోంది. ఆస్ట్రేలియాలో బిగ్ బాష్, యూఏఈలో ఐఎల్ టీ20, అమెరికాలో మేజర్ లీగ్ క్రికెట్ ఇలా ప్రతి దేశం తమకంటూ ఒక సొంత బ్రాండ్‌ను సృష్టించుకుంటున్నాయి. తాజాగా ఈ రేసులోకి క్రికెట్ అంటే ఎంతో క్రమశిక్షణతో ఆడే న్యూజిలాండ్ కూడా చేరింది. ఇప్పటివరకు అక్కడ జరుగుతున్న సూపర్ స్మాష్ స్థానంలో సరికొత్త హంగులతో ఘ్లీ20 ఫ్రాంచైజీ లీగ్‌ను ప్రారంభించాలని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం.. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న దేశీయ టీ20 టోర్నమెంట్ సూపర్ స్మాష్ స్థానంలో ఘ్లీ20 పేరుతో ఒక ఫ్రాంచైజీ లీగ్ ప్రారంభం కానుంది. ఈ లీగ్‌లో మొత్తం 6 జట్లు ఉంటాయి. ఐపీఎల్ తరహాలోనే ఈ జట్లకు ప్రైవేట్ యజమానులు ఉంటారు. జనవరి 2027లో ఈ లీగ్ అట్టహాసంగా ప్రారంభం కానుంది. కేవలం పురుషుల క్రికెట్ మాత్రమే కాకుండా, మహిళల క్రికెట్‌ను కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మహిళల టీ20 లీగ్‌ను కూడా దీనిలో భాగంగా నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు అధ్యక్షురాలు లిండన్ మాట్లాడుతూ.. ఈ లీగ్ కేవలం వినోదం కోసమే కాకుండా స్థానిక యువ క్రికెటర్లకు ఒక గొప్ప వేదిక కావాలని ఆకాంక్షించారు. ప్రతి టీమ్‌లో స్థానిక స్టార్ క్రికెటర్లు ఉండాలని, తద్వారా యువ ఆటగాళ్లు తమ హీరోలతో కలిసి ఆడుతూ నేర్చుకునే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. మొదట్లో ఆస్ట్రేలియాలోని బిగ్ బాష్ లీగ్‌లో న్యూజిలాండ్ జట్లను చేర్చాలని చర్చలు జరిగినప్పటికీ, చివరికి తమకంటూ ఒక సొంత లీగ్ ఉండటమే మేలని బోర్డు నిర్ణయించుకుంది. న్యూజిలాండ్‌లో క్రికెట్ కంటే రగ్బీకి ఎక్కువ ఆదరణ ఉంటుంది. అయితే, ప్రైవేట్ ఇన్వెస్టర్లు క్రికెట్ లీగ్‌లోకి రావడం వల్ల బోర్డుకు భారీగా ఆదాయం సమకూరనుంది. ఐపీఎల్ ద్వారా బీసీసీఐ ఎలాగైతే ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డుగా ఎదిగిందో, న్యూజిలాండ్ కూడా అదే బాటలో నడవాలని చూస్తోంది. ఆర్థికంగా బలం చేకూరితే, క్రికెటర్లకు ఇచ్చే పారితోషికాలు కూడా పెరుగుతాయి, తద్వారా ఆటగాళ్లు విదేశీ లీగ్‌ల వైపు మొగ్గు చూపకుండా తమ దేశం తరపున ఆడేందుకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం సౌత్ ఆఫ్రికా పాకిస్థాన్ , బంగ్లాదేశ్ వెస్టిండీస్ వంటి లీగ్‌లు ఇప్పటికే సక్సెస్ అయ్యాయి. ఈ లీగ్‌ల వల్ల కొత్త టాలెంట్ వెలుగులోకి రావడమే కాకుండా, క్రికెట్ గ్లోబల్ మార్కెట్ కూడా పెరుగుతోంది. న్యూజిలాండ్ కూడా ఈ కొత్త లీగ్‌తో గ్లోబల్ క్రికెట్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని భావిస్తోంది. ఐపీఎల్ టీమ్ ఓనర్లు ఎవరైనా కివీస్ లీగ్‌లో జట్లను కొనుగోలు చేస్తారేమో చూడాలి.

## 'ధోనీ సార్, 60ఏళ్ల దాకా మీరు

## IPL ఆడగలరు'- తమిళ స్టార్ హీరో

2026- చెన్నై సూపర్ కింగ్స్ రోర్ 2026 ప్రోగ్రామ్ - ఈవెంట్లో పాల్గొన్న క్రికెటర్లు



గత కొన్నేళ్లుగా ఐపీఎల్ ముగుస్తుందంటే చాలు, 'వచ్చే ఏడాది ధోనీ ఉంటాడా, 'ధోనీ ఇక ఐపీఎల్ కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడా' అనే ప్రశ్నలు అందరిలోనూ మెదులుతున్నాయి. ఈ ప్రశ్నకు ధోనీ కూడా స్పందిస్తూ 'కచ్చితంగా వచ్చే ఏడాది ఐపీఎల్ లో నన్ను చూస్తారు!' అంటూ సమాధానం చెప్పుకుంటూ వస్తున్నాడు. అయితే ఈ క్యాష్ రిచ్ లీగ్ మరో కొత్త సీజన్ కు టైమ్ వచ్చేసింది. మరో ఐదు రోజుల్లోనే ఐపీఎల్ 19వ ఎడిషన్ షురూ కానుంది. ఈ నేపథ్యంలో 44ఏళ్ల ధోనీకి ఈసారి కూడా ఈ ప్రశ్న ఎదురవడం పక్కా! కానీ, ఈసారి అతడు ఎలాంటి జవాబిస్తాడో అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. ఈ క్రమంలో తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ వ్యాఖ్యలు ఆందరినీ ఆకట్టుకుంటున్నాయి. ధోనీకి ఉన్న ఫిట్ నెస్ తో అతను 60ఏళ్ల దాకా ఐపీఎల్ ఆడగలడని శివకార్తికేయన్ అన్నారు. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా తాజాగా 'రోర్ 2026' (=శ్రీతీ 2026) పేరిట ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ ఈవెంట్ లో పాల్గొన్న నటుడు శివకార్తికేయన్ ధోనీ ఐపీఎల్ కెరీర్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

ట్రై చేస్తా- ధోనీ

"ఇదే ఐపీఎల్ మీకు చివరి సీజనా అని కొన్నేళ్ల కిందట అడిగినప్పుడు 'కచ్చితంగా కాదు' అని ఆన్సర్ చెప్పారు. అయితే ప్రతీ సీజన్ లోనూ మీ నుంచి ఇదే ఆన్సర్ రావాలని కోరుకుంటున్నాం. సార్, మీరు ఇప్పటికీ చాలా ఫిట్ గా ఉన్నారు. ఈ ఫిట్ నెస్‌తో 60ఏళ్ల దాకా ఆడొచ్చు (సరదాగా)' అని అన్నారు. దీనికి ధోనీ రిప్లై ఇస్తూ 'అది చాలా కష్టం కానీ ట్రై చేస్తా' అని చెప్పారు. ధోనీ సమాధానంతో ఆడియెన్స్ ఒక్కసారిగా ఈలలు, కేరింతలు, చప్పట్లతో మార్మోగిపోయింది.

రైనా- హెడన్ కు అరుదైన గౌరవం

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాళ్లు సురేశ్ రైనా, మాథ్యూ హెడెన్ కు అరుదైన గౌరవం దక్కింది. ఈ ఇద్దరు క్రికెటర్లను సీఎస్కే ఫ్రాంచైజీ తమ మొట్టమొదటి హాల్ ఆఫ్ ఫేమ్ లో చేర్చింది. ఈ కార్యక్రమంలో జ్ఞాపికలను అందజేస్తూ రైనా, హెడెన్ ను సీఎస్కే మేనేజ్ మెంట్ సత్కరించింది. దీంతో చెన్నై హాల్ ఆఫ్ ఫేమ్ లో చోటు దక్కించుకున్న తొలి ప్లేయర్లుగా ఈ ఇద్దరూ రికార్డు కొట్టారు. పీఎల్ లో రైనా సీఎస్కే జట్టులో కీలక ప్లేయర్ గా ఎదిగాడు. 2008 నుంచి 2021 దాకా చెన్నైకు ఆడాడు. మధ్యలో రెండేళ్లు (2016, 2018) గుజరాత్ లయన్స్ కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక సీఎస్కే టైటిల్ సాధించిన ఐదు సందర్భాల్లో రైనా నాలుగు సందర్భల్లో (2010, 2011, 2018, 2021) జట్టు సభ్యుడు. అలాగే జట్టు విజయాల్లో అనేకసార్లు కీలక పాత్ర పోషించాడు. 2010, 2014లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు సైతం నెగ్గాడు. అతడు ఐపీఎల్ లో చెన్నై తరఫున 5529 పరుగులు చేశాడు. ఇక ఆస్ట్రేలియాన్ లెజెండ్ హెడెన్ 2008- 2010 మధ్యలో మూడు సీజన్లలో చెన్నై తరఫున బరిలో దిగాడు. ఈ సీజన్లలో హెడెన్ అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా 2009లో 572 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. కాగా, ఈ ఎడిషన్ లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్ జట్టుతో చెన్నై సూపర్ కింగ్స్ గువాహటి వేదికగా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు షురూ కానుంది. ఈసారి యువ నాయకుడు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సీఎస్కే బరిలో దిగనుంది.

## ఐసీసీ అవార్డుల్లో భారత్, పాక్ జోరు..

## ఫర్హాన్, అరుంధతి రెడ్డిలదే హవా

ఐసీసీ ఫిబ్రవరి నెలకు గాను పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్, భారత బౌలర్ అరుంధతి రెడ్డిలను ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపిక చేసింది. ముఖ్యంగా ఇటీవలే ముగిసిన టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసినందుకు ఫర్హాన్ కు ఈ గౌరవం దక్కింది.

అంతర్జాతీయ క్రికెట్ మండలి ఫిబ్రవరి 2026 నెలకు సంబంధించి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రకటించింది. ఈసారి భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు చెరో అవార్డును దక్కించుకోవడం విశేషం. పురుషుల విభాగంలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్, మహిళల విభాగంలో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా ఇటీవలే ముగిసిన టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసినందుకు ఫర్హాన్ కు ఈ గౌరవం దక్కింది.

సాహిబ్‌జాదా ఫర్హాన్

పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ టీ20 వరల్డ్ కప్ 2026లో మునుపెన్నడూ లేని విధంగా చెలరేగిపోయాడు. పాకిస్థాన్ జట్టు సూపర్-8 దశలోనే నిష్క్రమించినప్పటికీ, ఫర్హాన్ వ్యక్తిగత ప్రదర్శన మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. కేవలం 6 ఇన్నింగ్స్‌ల్లోనే 76.6 సగటుతో 383 పరుగులు రాబట్టాడు. ఇందులో రెండు అద్భుతమైన సెంచరీలు ఉండటం గమనార్హం. 160కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన అతడు, టోర్నీలో ఏకంగా 18 సిక్సర్లు, 37 ఫోర్లతో స్టేడియాలను హోరెత్తించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతడిని ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నిలబెట్టింది.

అరుంధతి రెడ్డి

మహిళల క్రికెట్‌లో భారత పేసర్ అరుంధతి రెడ్డి ఫిబ్రవరి నెలలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరిగిన టీ20 సిరీస్‌లో అరుంధతి తన స్వింగ్ బౌలింగ్‌తో

# 'ఫెరారీలో వెళ్తున్నా నేను హనుమాన్ చాలీసానే వింటాను'- హార్దిక్ పాండ్య

## ఐపీఎల్ 2026- హార్దిక్ పాండ్య లేటెస్ట్ కామెంట్స్






ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య క్రీడా వర్గాల్లో ఎప్పుడూ హాట్‌టాపిక్ గా నిలుస్తుంటాడు. రీసెంట్ గా అత్యంత ఖరీదైన ఫెరారీ 12 సిలిండ్రి 'ఖీవతీతీఱఱ 12జఱశ్రీఱఅంతీఱ' కారును కొనుగోలు చేశాడు. దీని ఖరీదు రూ.8 కోట్లకు పైమాటే. ఈ లగ్జరీ కారులో పాండ్య రీసెంట్ గా తన గర్ల్ ఫ్రెండ్ తో కలిసి చక్కర్లు కొట్టిన వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో అతడి లగ్జరీ లైఫ్ గురించి మరోసారి నెట్టింట చర్చ మొదలైంది. ఈ క్రమంలో హార్దిక్ తాజాగా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం హార్దిక్ ఐపీఎల్ ప్రిపరేషన్స్ లో బిజీగా ఉన్నాడు. తాజాగా జట్టు బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్‌తో ముంబయిలో ఓ ఈవెంట్ లో పాల్గొన్నాడు. ఇందులో అతడు మాట్లాడుతూ, హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జీ ఏ పాట కూడా ఇవ్వలేదని పేర్కొన్నాడు. తాను ఫెరారీ కారులో వెళ్తున్నప్పటికీ జర్నీ చేసేటప్పుడు 'హనుమాన్ చాలీసా'నే వింటానని తెలిపాడు. 'నాకు ఫెరారీ కారు ఉంది. అది ఎంత లగ్జరీ అయినప్పటికీ అందులో వెళ్తుంటే నేను హనుమాన్ చాలీసానే వింటాను. ఏ పాట కూడా హనుమాన్ చాలీసా ఇచ్చినంత పాజిటివ్ ఎనర్జీ ఇవ్వలేదు. దీనిని అందరూ అంగీకరించాల్సిందే!' అని హార్దిక్ చెప్పాడు. అయితే అత్యంత ఖరీదైన వాచీలు ధరించడం నుంచి లగ్జరీ కార్లలో తిరగడం దాకా హార్దిక్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటాడు. ఇటీవల భారత్ టీ20 వరల్డ్ కప్ నెగ్గిన సందర్భంలో మైదానంలో తన గర్ల్ ఫ్రెండ్ మహీకా శర్మతో హార్దిక్ చేసుకున్న సంబరాలు కాంట్రవర్సీ అయ్యాయి.

కెప్టెన్సీ నుంచి పాండ్య తప్పుకోవాలి!

మరో 5 రోజుల్లో లీగ్ ప్రారంభం ఉండగా, ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పాండ్య తనకు తానుగా కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని అన్నాడు. అలాగే ఇటీవల భారత్ కు వరల్డ్ కప్ సాధించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కు మేనేజ్ మెంట్ జట్టు పగ్గాలు అప్పగించాలని తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషిస్తూ పేర్కొన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, పాండ్యాతో కలిసి ఈ విషయమై ఫ్రాంచైజీ మేనేజ్ మెంట్ చర్చించాలని అన్నాడు. 'ఈ ఏడాది సూర్య కెప్టెన్ గా ఉండాలి. అయితే ఇక్కడ హార్దిక్ మంచి నాయకుడే. కానీ విచిత్రమేంటంటే ప్రస్తుతం అతడి కెప్టెన్సీలోనే టీ20 వరల్డ్ కప్ లు గెలిచిన ఇద్దరు ఆడుతున్నారు. వాస్తవానికి సూర్య కెప్టెన్సీ ఇవ్వాలి. కానీ మేనేజ్ మెంట్ మాత్రం పాండ్యకే మొగ్గు చూపుతుందేమో' అని కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు.

అదే నా టార్గెట్:

పాండ్య కాగా, ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబయి ఇండియన్స్ కు ఆరో టైటిల్ అందించడమే తన లక్ష్యమని హార్దిక్ అన్నాడు. జట్టులో ఇప్పటికే ఘనమైన వారసత్వం ఉందని, ఆ లెగసీని ముందుకు తీసుకెళ్లడమే తన పని అని పేర్కొన్నాడు. టీమ్ లో అందరూ శక్తి వంచన లేకుండా ఆడేందుకు సిద్ధంగా ఉన్నారని, అత్యుత్తమ ఆటకు తమ జట్టు ప్రతిబింబంలా నిలవాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు.

ముంబై ఇండియన్స్ స్క్వాడ్ 2026

రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, నమన్ ధీర్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, దానిష్ మాలెవార్, మయాంక్ రావత్, క్వింటన్ డి కాక్, ర్యాన్ రికెల్టన్, రాబిన్ మింజ్, హార్దిక్ పాండ్య (కెప్టెన్), విల్ జాక్స్, మిచెల్ శాంట్నర్, కార్బిన్ బాష్, శార్దుల్ ఠాకూర్, ఘజన్‌ఫర్, అధర్వ అంకోలేకర్, రఘు శర్మ, జస్ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, అశ్వనీ కుమార్, మహ్మద్ ఇజార్

# ఐపీఎల్ లో హ్యాట్రిక్ మ్యాజిక్- 19ఏళ్లలో ఆ ముగ్గురు బౌలర్ల రికార్డులే వేరు!

ఐపీఎల్ చరిత్రలో తొలి హ్యాట్రిక్ వీరుడిగా లక్ష్మీపతి బాలాజీ- మూడు హ్యాట్రిక్కులతో ఎవరికీ అందని రికార్డు సృష్టించిన సీనియర్ స్పిన్నర్- ఒకే సీజన్ లో రెండు హ్యాట్రిక్కులు తీసిన ఏకైక ఆటగాడు అతనే




క్రికెట్ లో బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతుంటే బౌలర్లు తమదైన వ్యూహాలతో చెక్ పెడుతుంటారు. అయితే కేవలం మూడు బంతుల్లోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసే 'హ్యాట్రిక్' మ్యాజిక్ మాత్రం ఎప్పుడూ ఒక ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. ఐపీఎల్ 19 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటివరకు మొత్తం 23 సార్లు ఈ అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. 2008లో మొదలైన ఈ లీగ్ లో ఎందరో దిగ్గజ బౌలర్లు తమ స్పిన్, స్పీడ్ తో బ్యాటర్లను బోల్తా కొట్టించి హ్యాట్రిక్ క్లబ్ లో చేరారు. పరుగుల వరద పారే ఈ లీగ్ లో బౌలర్లు తమ ఆధిపత్యాన్ని చాటుకున్న ఆ అద్భుత హ్యాట్రిక్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

తొలి హ్యాట్రిక్ రికార్డు

ఐపీఎల్ చరిత్రలో మొట్టమొదటి హ్యాట్రిక్ నమోదు చేసిన ఘనత లక్ష్మీపతి బాలాజీకి దక్కుతుంది. 2008లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతూ పంజాబ్ కింగ్స్ పై ఆయన ఈ రికార్డ్ అందుకున్నారు. ఆఖరి ఓవర్ లో పంజాబ్ గెలవడానికి 19 పరుగులు కావాల్సిన సమయంలో, వరుసగా ఇర్ఫాన్ పఠాన్, పీయూష్ చావ్లా, వీఆర్వీ సింగ్ లను అవుట్ చేసి బాలాజీ హ్యాట్రిక్ పూర్తి చేశారు. అదే మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్ గా నిలవడం విశేషం. చెన్నై గడ్డపై జరిగిన ఈ అద్భుతం ఇప్పటికీ అభిమానుల గుండెల్లో నిలిచిపోయింది.

అమిత్ మిశ్రా అరుదైన ఫీట్- మూడు సార్లు హ్యాట్రిక్

ఐపీఎల్ హ్యాట్రిక్ ల జాబితాను ఒకసారి గమనిస్తే లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా పేరు అగ్రస్థానంలో కనిపిస్తుంది. అతను తన కెరీర్ లో ఏకంగా మూడు సార్లు హ్యాట్రిక్కులు సాధించి ఎవరికీ అందని రికార్డును అందుకున్నారు. విశేషం ఏమిటంటే, ఈ మూడు హ్యాట్రిక్కులను మూడు వేర్వేరు జట్ల తరపున (ఢిల్లీ క్యాపిటల్స్, డెక్కన్ చార్జర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్) సాధించారు. బ్యాటర్లను బురిడీ కొట్టించడంలో మిశ్రా చూపించిన ఆ స్పిన్ మ్యాజిక్ ఐపీఎల్ లోనే టాప్ హైలైట్స్ అని చెప్పవచ్చు.

యువరాజ్ సింగ్ రికార్డు- ఒకే సీజన్ లో రెండు సార్లు

భారత మాజీ స్టార్ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ బౌలింగ్‌లోనూ తనదైన ముద్ర వేశారు. 2009 సీజన్లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతూ ఏకంగా రెండు సార్లు హ్యాట్రిక్కులు పడగొట్టారు. ఒకే సీజన్లో రెండు హ్యాట్రిక్కులు తీసిన ఏకైక బౌలర్‌గా యువరాజ్ ఒక రికార్డ్ సృష్టించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆ సీజన్ మొత్తంలో అతను తీసిన వికెట్లు కేవలం ఆరు మాత్రమే, ఆ ఆరూ ఈ రెండు హ్యాట్రిక్కుల రూపంలోనే రావడం గమనార్హం. రోహిత్ శర్మ కూడా అదే ఏడాది హ్యాట్రిక్ తీయడంతో 2009 సీజన్లో అత్యధికంగా మూడు హ్యాట్రిక్కులు నమోదయ్యాయి.

చాహల్ లేటెస్ట్ మ్యాజిక్

ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ యుజ్వేంద్ర చాహల్, తన హ్యాట్రిక్‌ల జాబితాను కూడా పెంచుకుంటున్నారు. ఐపీఎల్ 2025 సీజన్లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతూ చెన్నై సూపర్ కింగ్స్‌పై హ్యాట్రిక్ సాధించారు. 19వ ఓవర్లో వరుసగా దీపక్ హుడా, అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్‌ల వికెట్లు తీసి చాహల్ ఈ ఘనత అందుకున్నారు. దీంతో మిశ్రా, యువరాజ్ సరసన మల్టిపుల్ హ్యాట్రిక్ లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ కూడా చేరారు.

శామ్ కరన్ వెరైటీ రికార్డు- రెండు ఓవర్ల హ్యాట్రిక్

ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ శామ్ కరన్ ఐపీఎల్‌లో ఒక వెరైటీ హ్యాట్రిక్ రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. 2019లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఆడుతున్నప్పుడు రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి హ్యాట్రిక్ పూర్తి చేశారు. ఒక ఓవర్ చివరి బంతికి వికెట్ తీసి, తన తదుపరి ఓవర్లోని మొదటి రెండు బంతులకు వికెట్లు పడగొట్టడం ద్వారా ఈ ఫీట్ సాధించారు. ఐపీఎల్‌లో రెండు వేర్వేరు ఓవర్ల స్పెల్స్‌లో కలిపి హ్యాట్రిక్ తీసిన ఏకైక బౌలర్‌గా శామ్ కరన్ గుర్తింపు పొందారు.

టీమ్స్, వేదికల రికార్డులు

ఇక జట్ల పరంగా చూస్తే పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు అత్యధికంగా చెరో 5 హ్యాట్రిక్కులు సాధించి టాప్‌లో ఉన్నాయి. అంటే ఈ జట్ల బౌలర్లు ప్రత్యర్థి టీమ్‌లను ఎక్కువగా హ్యాట్రిక్కులతో దెబ్బతీశారు. ఇక దురదృష్టవశాత్తూ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు అత్యధికంగా 4 సార్లు హ్యాట్రిక్కులకు బలైంది, అంటే ఈ టీమ్ బ్యాటర్లు నాలుగు సార్లు వరుసగా వికెట్లు ఇచ్చుకున్నారు. ఇక మైదానాల విషయానికి వస్తే, అహ్మదాబాద్, బెంగళూరు స్టేడియాలు హ్యాట్రిక్కులకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఈ రెండు వేదికల్లోనే అత్యధికంగా చెరో మూడు సార్లు బౌలర్లు ఈ అరుదైన హ్యాట్రిక్ ఫీట్ సాధించారు. ఓవర్సీస్ ప్లేయర్లలో దక్షిణాఫ్రికా పేసర్ మఖాయ ఎన్తిని ఐపీఎల్‌లో తొలి ఓవర్సీస్ హ్యాట్రిక్ వీరుడిగా నిలిచారు. ఐపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించడం అనేది కేవలం అదృష్టం మాత్రమే కాదు, బౌలర్‌కు టాలెంట్ కూడా హై రేంజ్‌లోనే ఉండాలి. ఇక రాబోయే సీజన్లలో మరెంత మంది ఈ హ్యాట్రిక్ క్లబ్‌లో చేరుతారో చూడాలి.

# క్రికెట్‌లో హ్యాట్రిక్ అంటే ఏంటి ఆ పేరు ఎలా వచ్చింది దీని వెనుక ఉన్న అసలు కథ ఇదే

క్రికెట్‌లో హ్యాట్రిక్ పదం 1858లో మొదలైంది. బౌలర్ స్టీఫెన్సన్ వరుసగా 3 వికెట్లు తీసినందుకు అభిమానులు టోపీని బహుమతిగా ఇవ్వడంతో హ్యాట్రిక్ అనే పేరు స్థిరపడిపోయింది. మూడు వికెట్లు తీయడం గొప్ప ట్రిక్ అని భావించి, దానికి హ్యాట్ జోడించి.. కాలక్రమేణా హ్యాట్రిక్ అని పిలవడం అలవాటుగా మారింది.



క్రికెట్ మైదానంలో బ్యాటర్లు సెంచరీలు బాదితే వచ్చే కిక్కు ఒక ఎత్తు అయితే, బౌలర్ వరుసగా మూడు బంతుల్లో ముగ్గురు బ్యాటర్లను పెవిలియన్ పంపితే వచ్చే జోష్ మరో ఎత్తు. దీనినే మనం హ్యాట్రిక్ అని పిలుచుకుంటాం. అయితే, అస్సలు ఈ హ్యాట్రిక్ అనే పదానికి, క్రికెట్‌కు సంబంధం ఏంటి? మూడు వికెట్లు తీస్తే హ్యాట్ (టోపీ) అని ఎందుకు అంటారు? దీని వెనుక 168 ఏళ్ల నాటి ఒక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. ఆ విశేషాలేంటో వివరంగా తెలుసుకుందాం.

### 1858లో మొదలైన అసలు కథ

హ్యాట్రిక్ అనే పదం 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్ గడ్డపై పుట్టింది. 1858లో జరిగిన ఒక మ్యాచ్ ఈ పదానికి పునాది వేసింది. హీత్‌ఫీల్డ్ హార్మన్ స్టీఫెన్సన్ అనే బౌలర్ ఆ రోజుల్లో రౌండ్ ఆర్మ్ బౌలింగ్‌తో బ్యాటర్లను హడలెత్తించేవాడు. ఆయన ఆల్ ఇంగ్లాండ్ టీమ్ తరపున ఆడుతూ హలామ్ అండ్ స్టేలీ జట్టుపై వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు పడగొట్టాడు. ఆ కాలంలో ఇది ఒక అసాధారణమైన ఘనత. స్టీఫెన్సన్ ప్రదర్శనకు ఫిదా అయిన అభిమానులు, తోటి ఆటగాళ్లు ఆయనను వినూత్నంగా గౌరవించాలని అనుకున్నారు.

### వికెట్లకు.. టోపీకి లింక్ ఏంటి

స్టీఫెన్సన్ వరుసగా మూడు వికెట్లు తీసిన తర్వాత, మైదానంలోని అభిమానులందరూ కలిసి చందాలు పోగుచేశారు. ఆ డబ్బుతో ఒక కొత్త హ్యాట్(టోపీ)ని కొని, దాన్ని స్టీఫెన్సన్‌కు బహుమతిగా ఇచ్చారు. అంటే, వరుసగా మూడు వికెట్లు తీసిన బౌలర్‌కు ఒక టోపీని బహుమతిగా ఇచ్చే సంప్రదాయం అక్కడ మొదలైంది. మూడు వికెట్లు తీయడం అనేది ఒక గొప్ప ట్రిక్ అని భావించి, దానికి హ్యాట్ బహుమతిని జోడించి.. కాలక్రమేణా ఆ ఘనతను హ్యాట్రిక్ అని పిలవడం అలవాటుగా మారింది.

### అచ్చులో కనిపించిన తొలి హ్యాట్రిక్

ఈ పదం మొదట వాడుకలోకి వచ్చినప్పటికీ, 1878-79లో ఫ్రెడ్ స్పాఫోర్త్ టెస్ట్ క్రికెట్‌లో మొదటి హ్యాట్రిక్ సాధించినప్పుడు వార్తాపత్రికలు తొలిసారిగా హ్యాట్రిక్ అనే పదాన్ని అధికారికంగా వాడాయి. అప్పటి నుంచి క్రికెట్ భాషలో ఈ పదం విడదీయలేని భాగమైపోయింది. నేడు క్రికెట్ మాత్రమే కాదు.. హాకీ, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో కూడా వరుసగా మూడు గోల్స్ చేసినా లేదా మూడు విజయాలు సాధించినా హ్యాట్రిక్ అని పిలుస్తున్నారు. కానీ దీని మూలాలు మాత్రం 1858 నాటి క్రికెట్ మైదానంలోనే ఉన్నాయి.

ఆధునిక క్రికెట్‌లో హ్యాట్రిక్ ప్రాముఖ్యత

నేటి టీ20, వన్డే క్రికెట్‌లో హ్యాట్రిక్ తీయడం మరింత కష్టతరంగా మారింది. బ్యాటర్లు ఎదురుదాడి చేస్తున్న తరుణంలో, బౌలర్ తన నైపుణ్యాన్ని ఉపయోగించి మూడు వరుస వికెట్లు తీయడం అనేది అత్యున్నత ప్రదర్శనగా పరిగణించబడుతుంది. భారత్ తరపున చేతన్ శర్మ మొదలుకొని కపిల్ దేవ్, కుల్దీప్ యాదవ్, షమీ వంటి బౌలర్లు అంతర్జాతీయ వేదికలపై హ్యాట్రిక్ తీసి చరిత్ర సృష్టించారు. కాబట్టి, వచ్చేసారి ఏదైనా మ్యాచ్‌లో బౌలర్ హ్యాట్రిక్ తీసినప్పుడు.. అది కేవలం మూడు వికెట్లు మాత్రమే కాదు, 160 ఏళ్ల నాటి ఒక అద్భుతమైన సంప్రదాయంగా గుర్తుండిపోతుంది.

## వెల్దుర్తి వెంకట నర్సు నాయుడు వర్ధంతి

# సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు...



వెల్దుర్తి//మార్చి 23 (ఆకాంక్ష) : పౌరాణిక పద్య నాటక రంగ స్థలం లో వేలాది ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులు సంపాదించుకున్న మహోన్నత కళాకారుడు, రాయలసీమ రత్నం బిరుదాంకితుడు స్వర్గీయ వెల్దుర్తి వెంకటనరసు నాయుడు వర్ధంతి సందర్భంగా వారి మనుమరాలు శ్రీమతి అరుణ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేదలకు ఆహార పొట్లాలు అందించారు. పాండురంగ స్వామి గోశాలలో గోవుల పోషణ నిమిత్తం శివ జీవైక్య మఠాధిపతి ఎల్లప్ప స్వామికి కొంత నగదును అందజేశారు. మహా పుణ్య క్షేత్రం బ్రహ్మగుండం క్షేత్రంలో మూగజీవాలకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహా నాయుడు, వైద్యం రామానాయుడు పాల్గొన్నారు.

# సహారా బాధితుల సొమ్ము వెంటనే చెల్లించాలి...

## సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్...




రాజన్న సిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) :సహారా ఇండియాలో సామాన్య ప్రజలు తమ కష్టార్జిత సొమ్మును నమ్మకంతో దాచుకున్నప్పటికీ, ఇప్పటికీ తిరిగి అందకపోవడం దురదృష్టకరమని, బాధితుల డిపాజిట్ మొత్తాన్ని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కేంద్రంలోని అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహారా యాజమాన్యం దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలను ప్రజల నుంచి వసూలు చేసిందని, రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే వేలాది మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు పిల్లల పెళ్లిళ్లు, విద్య, కుటుంబ భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్ము కంపెనీ మూతపడటంతో నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.సహారా సంస్థ ఆస్తులను విక్రయించి బాధితులకు పూర్తి న్యాయం చేయాల్సిందిపోయి,కేవలం రూ.50 వేల వరకు మాత్రమే చెల్లింపులు చేస్తూ కాలయాపన చేయడం సరైంది కాదని ముశం రమేష్ విమర్శించారు. ఈ విధానం వల్ల బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగదని స్పష్టం చేశారు. సహారా బాధితులందరూ ఐక్యంగా పోరాడితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని ప్రకటించారు.ఇందులో భాగంగా మంగళవారం సిరిసిల్ల ఆర్డీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. బాధితులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు జవ్వాజి విమల, సూరం పద్మ, దాసరి రూప, ఆడెపు రజిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో బాంబు బెదిరింపు కలకలం...

## ఈమెయిల్ సందేశం ఫేక్ అని తేల్చిన పోలీసులు...

సిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుకు సోమవారం ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశం అందడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోర్టు అధికారులకు బెదిరింపు మెయిల్ అందిన వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అత్యంత అప్రమత్తమయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి కోర్టు భవనంలో ఉన్న న్యాయ మూర్తులు, సిబ్బంది, న్యాయ వాదులు, కక్షిదారులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఆ తరువాత పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కోర్టు ఆవరణను పూర్తిగా తనిఖీ చేశాయి. కోర్టు భవనంలోని ప్రతి విభాగాన్ని అణువణువూ గాలించినప్పటికీ ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు గుర్తించలేదు. విస్తృత స్థాయిలో తనిఖీలు పూర్తి చేసిన అనంతరం బెదిరింపు సందేశం ఫేక్ అని పోలీసులు నిర్ధారించారు.ఈ పరిణామంతో కోర్టు సిబ్బంది, న్యాయ వాదులు, కక్షిదారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇటువంటి బెదిరింపు సందేశాలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈమెయిల్ ఎక్కడి నుండి పంపబడింది, దీని వెనుక ఎవరున్నారు, ఉద్దేశ్యం ఏమిటి అనే కోణాల్లో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. జిల్లాలో కీలక న్యాయస్థానానికి వచ్చిన ఈ బెదిరింపు సందేశం కొద్దిసేపు కలకలం రేపినా, అది ఫేక్ అని తేలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు తప్పనిసరి...

### సామాజిక సామరస్య పరిరక్షణలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి...

### ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో సర్పంచులతో ప్రత్యేక సమావేశం...

ముస్తాబాద్//మార్చి 23 (ఆకాంక్ష) : ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ భద్రత, నేరాల నియంత్రణ,సామాజిక సామరస్య పరిరక్షణ అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.గ్రామాల్లో నేరాల నియంత్రణకు, అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచడానికి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ రక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగ పడతాయని తెలిపారు.వేసవి కాలం నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కోరారు. రాత్రి సమయాల్లో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే వారు ముందస్తుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.సామాజిక అంశాలపైనా ఎస్ఐ గణేష్ దృష్టి సారించారు. గ్రామాల్లో కుల వివక్షకు ఎలాంటి తావు లేకుండా ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలని, సామాజిక సామరస్యాన్ని కాపాడడంలో సర్పంచులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ ఈసీ కీలక నిర్ణయం

# ఉచిత ప్రసారాల కోసం పార్టీలకు డిజిటల్ వోచర్లు

### ప్రసార షెడ్యూల్ కోసం లాటరీ - ప్రతి పార్టీకి 45 నిమిషాల ఉచిత ప్రసారం- ముందస్తు అనుమతి తప్పనిసరి- స్పష్టం చేసిన ఈసీ

దేశంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచితంగా ప్రసారం, టెలికాస్ట్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అందుకోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదుల చేసింది.

ప్రసార షెడ్యూల్ కోసం లాటరీ

ప్రజా ప్రాతినిధ్యం చట్టం-1951లోని సెక్షన్ 39ఏ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. అసెంబ్లీ ఎన్నిక కోసం పుదుచ్చేరి, కేరళ, అసోం, తమిళనాడు, బంగాల్ రాష్ట్రాల్లోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఐటీ ప్లాట్ ఫామ్ ద్వారా ఈ డిజిటల్ టైం వోచర్ల జారీ చేసినట్లు పేర్కొంది. పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదలై తేదీ నుంచి పోలింగ్ కు రెండు రోజుల ముందు వరకు ఈ ఉచిత ప్రసార సమయం అందుబాటులో ఉంటుందని చెప్పింది. ప్రసార సమయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో లాటరీ ద్వారా పారదర్శకంగా నిర్ణయిస్తారని వెల్లడించింది.

ప్రతి పార్టీకి 45 నిమిషాల ఉచిత ప్రసారం

ప్రతి గుర్తింపు పొందిన పార్టీకి దూర్శదన్, ఆల్ ఇండియా రేడియోలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం ఇస్తారు. ఈ సమయాన్ని సంబంధిత రాష్ట్రాల్లోని ప్రాంతీయ ఛానెళ్లలో సమానంగా విభజిస్తారు. అదనపు ప్రసార సమయం గత ఎన్నికల్లో పార్టీ ప్రదర్శన ఆధారంగా కేటాయిస్తారు.

# తెలంగాణ విద్యా విధానం సవాళ్లు - సమతుల్య పరిష్కారాలు



మార్చి 23 (ఆకాంక్ష) :విద్య అనేది ఒక సమాజ భవిష్యత్తును నిర్ణయించే పునాది. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థపై జరుగుతున్న చర్చ, ముఖ్యంగా ప్రభుత్వ వర్సెస్ ప్రైవేట్ పాఠశాలల అంశం, ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు "పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలి" అని పిలుపునివ్వడం వెనుక ప్రభుత్వ విద్యపై భరోసా కల్పించాలనే ఆకాంక్ష కనిపిస్తోంది. అయితే, ఈ ఆకాంక్ష వాస్తవరూపం దాల్చాలంటే భావోద్వేగాల కంటే వ్యవస్థాగత మార్పులే కీలకం.ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభావంతులైన, కఠినమైన పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. ఇది ప్రభుత్వ వ్యవస్థకు ఉన్న అతిపెద్ద బలం. అయినప్పటికీ, కింది కారణాల వల్ల తల్లిదండ్రులు ప్రైవేట్ బాట పడుతున్నారు.మౌలిక సదుపాయాల కొరత: సరిపడా గదులు, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు మరియు ఆట స్థలాల లేమి.పర్యవేక్షణ లోపం: బోధన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడం.ఆంగ్ల మాధ్యమం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్ల బోధనలో ఇంకా పూర్తిస్థాయి పట్టు సాధించకపోవడం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నట్లుగా, విద్యా వ్యవస్థపై నమ్మకం కలగాలంటే అది పై స్థాయి నుండి మొదలవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే సామాన్య ప్రజల్లో ఆ వ్యవస్థపై ధీమా పెరుగుతుంది. ఇది కేవలం ఒక నియమంలా కాకుండా, ఒక నైతిక బాధ్యతగా మారినప్పుడే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారతాయి.ప్రైవేట్ పాఠశాలలను కేవలం వ్యాపార సంస్థలుగా చూడటం సరికాదు. లక్షలాది మంది విద్యావంతులకు ఇవి ఉపాధినిస్తున్నాయి.ప్రభుత్వ వ్యవస్థ కంటే మెరుగైన ఫలితాలు ఇవ్వాలనే పోటీ తత్వం విద్యార్థులకు మేలు చేస్తోంది.సాంకేతికతను, కొత్త బోధనా పద్ధతులను త్వరగా అందిపుచ్చుకోవడంలో ఇవి ముందుంటున్నాయి.విద్యా వ్యవస్థలో సమతుల్యత సాధించడానికి ప్రభుత్వం ఈ క్రింది చర్యలపై దృష్టి పెట్టాలి:బడ్జెట్‌లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, ఆ నిధులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూడాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి.అవసరమైన చోట ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో వసతులను మెరుగుపరచాలి. బోధనలో ఉత్తమ ఫలితాలు సాధించే ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకునే పారదర్శక వ్యవస్థ ఉండాలి.ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలు రెండూ ఒకదానికొకటి పోటీదారులు కావు, అవి ఒకే లక్ష్యం (విద్యార్థి వికాసం) కోసం పనిచేసే భిన్న మార్గాలు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా బలోపేతం చేసినప్పుడు, ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతారు. సమగ్రమైన ప్రణాళిక, చిత్తశుద్ధి ఉన్న నాయకత్వం తోడైతేనే తెలంగాణ "జ్ఞాన తెలంగాణ"గా అవతరిస్తుంది.

డా.పూసపాటి వేదాద్రి 9912197694

## రోగిని అర కిలోమీటరు మోసుకెళ్లి ఆస్పత్రికి తరలింపు...

## రుద్రంగిలో 108 సిబ్బంది సేవాభావం.. గ్రామస్తుల ప్రశంసలు..

# ప్రాణరక్షకుల్లా నిలిచిన 108 సిబ్బంది..




రుద్రంగి// మార్చి 23 (ఆకాంక్ష) : ప్రమాద సమయాల్లో ప్రాణరక్షకులుగా నిలిచే 108 అంబులెన్స్ సిబ్బంది మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ పొలంలో స్పృహ తప్పి పడిపోవడంతో, అంబులెన్స్ వెళ్లేందుకు మార్గం లేకపోయినా వెనుకడుగు వేయకుండా దాదాపు అర కిలోమీటరు మేర స్ట్రెచర్‌పై మోసుకెళ్లి సమయానికి ఆసుపత్రికి తరలించి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంది.రుద్రంగికి చెందిన మహ్మద్ ఆసియా సోమవారం తన పంట పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా రక్తపోటు తగ్గిపోవడంతో స్పృహ తప్పి కుప్పకూలింది. ఇది గమనించిన తోటి రైతులు, స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఈఎంటి మర్రి ప్రశాంత్, పైలెట్ తోట నరేందర్ అంబులెన్స్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు.అయితే బాధితురాలు పడిపోయిన ప్రదేశం పొలాల మధ్యలో ఉండటంతో అక్కడికి అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేకపోయింది. అయినప్పటికీ సమయాన్ని వృథా చేయకుండా సిబ్బంది స్ట్రెచర్‌ను తీసుకుని కాలినడకన పొలాల్లోకి చేరుకున్నారు. అనంతరం మహ్మద్ ఆసియాను స్ట్రెచర్‌పై ఎత్తుకుని దాదాపు అర కిలోమీటరు మేర మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చారు.అంబులెన్స్‌లోనే ఆమెకు ప్రాథమిక చికిత్స అందించిన సిబ్బంది, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి, కష్టాన్ని లెక్కచేయకుండా సేవాభావంతో ప్రాణరక్షణ చేసిన 108 సిబ్బంది మర్రి ప్రశాంత్, తోట నరేందర్‌లను గ్రామస్తులు, బాధితురాలి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఘటనతో అత్యవసర సమయాల్లో 108 సిబ్బంది చూపుతున్న సేవాస్ఫూర్తి, మానవత్వం మరోసారి వెలుగులోకి వచ్చింది.

## దేశం కోసం ప్రాణత్యాగం- వారసత్వ సంపదగా భగత్ సింగ్ డెత్ సర్టిఫికెట్- శిథిలావస్థలో 'కోఠి నంబర్ 1784'

# భద్రంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ డెత్ సర్టిఫికెట్లు నేటికీ మీరట్ కాలేజీ మ్యూజియంలో పదిలం


Death Certificate of Bhagat Singh

I hereby certify that the sentence of death passed on Bhagat Singh has been duly executed, and that the said Bhagat Singh was accordingly hanged by the neck till he was dead, at Lahore C. Jail on Monday the 23rd day of March 1931 at 7 p.m. that the body remained suspended for a full hour, and was not taken down until life was ascertained by a medical officer to be extinct; and that no accident, error or other misadventure occurred.

Superintendent of the Jail at

భారతదేశ స్వాతంత్ర్యం కోసం షహీద్-ఎ-ఆజం భగత్ సింగ్ ప్రాణాలను అర్పించారు. 1931 సంవత్సరం మార్చి 23న రాత్రి 7 గంటల 30 నిమిషాలకు లాహోర్ జైలులో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు ఉరికొయ్యల ఉగ్గుపాలను ఆనందంగా తాగారు. బ్రిటీష్ వాళ్ల అరాచక పాలన వల్ల 23 ఏళ్ల వయసులోనే భగత్ సింగ్, సుఖ్‌దేవ్, 22 ఏళ్లకే రాజ్‌గురు ప్రాణాలను కోల్పోయారు. ఇవాళ(మార్చి 23) షహీద్ దివస్ సందర్భంగా వారందరి త్యాగాన్ని యావత్ భారత్ స్మరించుకుంటోంది. దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో కలకాలం నిలిచిపోయే ఆ ముగ్గురు విప్లవ యోధుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఇప్పటికీ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ కాలేజీలో పదిలంగా ఉన్నాయి. వాటిని వారసత్వ సంపదగా పరిగణించి భద్రపరిచారు. ఇక ఇదే రాష్ట్రంలోని ఆగ్రాలో నూరీ దర్వాజా వద్దనున్న కోఠి నంబర్ 1784 శిథిలావస్థలో ఉంది. భగత్ సింగ్, ఆయన సహచరులు నివసించిన, బ్రిటీష్ వాళ్లపై పోరాటానికి బాంబులను తయారుచేసిన ఈ కోఠి ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. వీటితో ముడిపడిన చారిత్రక విశేషాలతో ఈటీవీ భారత్ కథనమిది.

## మీరట్ కాలేజీలో చారిత్రక పత్రాలు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ నగరంలోని కచేరీ రోడ్ మార్గంలో మేరఠ్ కాలేజీ ఉంది. ఇదొక గవర్నమెంట్ ఎయిడెడ్ కాలేజీ. దీన్ని 1892లో ఏర్పాటు చేశారు. ఈ కాలేజీలోని చరిత్ర విభాగానికి చెందిన బీఆర్ ఛటర్జీ మెమోరియల్ మ్యూజియంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల డెత్ సర్టిఫికెట్లు భద్రంగా ఉన్నాయి. ఈ చారిత్రక పత్రాలను ఒక వారసత్వ సంపదగా భద్రపరిచారు. కాలేజీ విద్యార్థులు ఈ మ్యూజియంకు వచ్చినప్పుడు భగత్ సింగ్ డెత్ సర్టిఫికెట్‌ను చూసి, ఆయన జీవించిన కాలం నాటి దేశ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారని మీరట్ కాలేజీ మీడియా ఇంఛార్జ్ చంద్రశేఖర్ తెలిపారు. విప్లవ యోధులు తమ గురించి ఏమాత్రం ఆలోచించుకోకుండా, దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన తీరును యువతరం అర్థం చేసుకోవడానికి ఈ పత్రాలు దోహదం చేస్తున్నాయని ఆయన చెప్పారు.

## భగత్ సింగ్ మరణ ధ్రువీకరణ పత్రం- స్ఫూర్తిమంత్రం

షహీద్ దివస్ సందర్భంగా చారిత్రక మేరఠ్ కాలేజీలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద సోమవారం రోజు ప్రత్యేక నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ యుధ్వీర్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1931 మార్చి 23న బ్రిటీష్ పాలకులు భగత్ సింగ్‌ను ఉరితీయడం అనే ఘటనతో భారత స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున ఎగిసిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పారని తెలిపారు. మీరట్ కాలేజీలో ఉన్న భగత్ సింగ్ మరణ ధ్రువీకరణ పత్రం భావితరాలకు స్ఫూర్తిని, దేశభక్తిని అందిస్తూనే ఉంటుందని యుధ్వీర్ సింగ్ అన్నారు.

## షహీద్ దివస్ పాదయాత్ర

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల శాఖకు చెందిన మేరా యువ భారత్ కేంద్రం ఆధ్వర్యంలో మీరట్‌లో సోమవారం షహీద్ దివస్ పాదయాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రలో రాష్ట్రపతి పతక గ్రహీత సరబ్‌జిత్ సింగ్ కపూర్‌తో పాటు విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

## లాహోర్ కుట్ర కేసు: జాన్ పి. సాండర్స్ హత్య

బ్రిటీష్ పోలీసుల లాఠీచార్జ్‌లో తీవ్ర గాయాలు కావడంతో 1928 నవంబర్ 17న లాలా లజపత్ రాయ్ అమరులయ్యారు. ఈ లాఠీచార్జ్‌కు ఆదేశాలిచ్చిన పోలీస్ సూపరింటెండెంట్ జేమ్స్ ఎ. స్కాట్‌ను చంపాలని భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ భావించారు. అయితే పొరపాటున బ్రిటీష్ పోలీసు అధికారి జాన్ పి. సాండర్స్‌ను జేమ్స్ ఎ. స్కాట్‌గా భావించి కాల్చి చంపారు. 1928 డిసెంబర్ 17న లాహోర్‌లో జాన్ పి. సాండర్స్ హత్య జరిగింది. దీన్నే లాహోర్ కుట్ర కేసు అంటారు.

## మారుపేర్లతో కోఠి నంబర్ 1784లో భగత్ సింగ్, సహచరులు

సీనియర్ చరిత్రకారుడు రాజకిశోర్ రాజే ప్రకారం, జాన్ పి. సాండర్స్‌ను హత్య చేసిన వెంటనే భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, లాహోర్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చేరుకున్నారు. వారితో పాటు చంద్రశేఖర్ ఆజాద్, బటుకేశ్వర్ దత్ కూడా ఇక్కడికి వచ్చారు. వీరంతా తమ పేర్లను మార్చుకున్నారు. చదువుకోవడానికి ఆగ్రాకు వచ్చామని అందరికీ చెప్పారు. ఆగ్రా నగరంలోని నూరీ దర్వాజా వద్దనున్న కోఠి నంబర్ 1784ను అద్దెకు తీసుకున్నారు. కోఠి యజమాని అయిన లాలా ఛన్నో మాల్‌కు వారు రెండున్నర రూపాయలను అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఈ కోఠికి ప్రతినెలా ఐదు రూపాయలను అద్దెగా చెల్లించేవారు. ఇక్కడ ఏడాదిన్నర పాటు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, బటుకేశ్వర్ దత్ నివసించారు. ఆగ్రాలో రంజిత్ సింగ్ అనే పేరుతో భగత్ సింగ్, బల్‌రాజ్ అనే పేరుతో చంద్రశేఖర్ ఆజాద్, రఘునాథ్ అనే పేరుతో రాజ్‌గురు, మోహన్ అనే పేరుతో బటుకేశ్వర్ దత్ చలామణి అయ్యారు.

## ఈ కోఠిలోని బాంబునే ఢిల్లీ అసెంబ్లీలో పేల్చారు

భగత్ సింగ్, ఆయన సహచరులు ఈ కోఠిలోనే బాంబులను తయారుచేయడం నేర్చుకున్నారు. బంగాల్‌కు చెందిన యతీంద్ర నాథ్ దాస్ వీరికి బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ కోఠిలో తయారుచేసిన తక్కువ తీవ్రత కలిగిన బాంబులను యమునా నది పర్వత పాదాల వద్దనున్న కైలాశ్, ఆగ్రా, కీతం అడవులలో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇక ఎక్కువ తీవ్రత కలిగిన బాంబులను భరత్‌పూర్, ఝూన్సీ అడవులలో పరీక్షించారు. కోఠి నంబర్ 1784లో తయారుచేసిన బాంబునే 1929 ఏప్రిల్ 8న ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో భగత్ సింగ్, బటుకేశ్వర్ దత్ పేల్చారు. అనంతరం అక్కడి నుండి పారిపోకుండా 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాలు చేశారు. తమను తాము పోలీసులకు అప్పగించుకున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ సేఫ్టీ బిల్', 'ట్రేడ్ డిస్ప్యూట్స్ బిల్' అనే రెండు అణచివేత చట్టాలకు నిరసనగా వారు ఈ దాడి చేశారు. ఈ కేసులో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను 1931 మార్చి 23న లాహోర్‌లోని సెంట్రల్ జైలులో ఉరితీశారు. బటుకేశ్వర్‌కు యావజ్జీవ కారాగార శిక్షను విధించారు.

## సాక్ష్యం చెప్పడానికి లాహోర్ కోర్టుకు ఆగ్రావాసులు

సీనియర్ చరిత్రకారుడు రాజకిశోర్ రాజే ప్రకారం, ఢిల్లీ అసెంబ్లీ బాంబు పేలుడు కేసు దర్యాప్తు కోసం బ్రిటీష్పో లీసులు ఆగ్రా నగరానికి వచ్చారు. కోఠి నంబర్ 1784లోనే బాంబులను తయారు చేశారని వారు గుర్తించారు. 1930 జూలై 28, 29 తేదీలలో ఆగ్రాకు చెందిన 12 మందిని సాక్ష్యం చెప్పడానికి లాహోర్‌కు తీసుకెళ్లారు. కోఠి నంబర్ 1784 యజమాని లాలా ఛన్నో, తాను భగత్ సింగ్‌కు ఒక గదిని అద్దెకు ఇచ్చానని లాహోర్ కోర్టులో అంగీకరించాడు. విప్లవకారులు పాలు తాగిన దుకాణదారుడు కూడా కోర్టులో సాక్ష్యం చెప్పాడు.

## కోఠిని స్మారక స్థలంగా మార్చాలని డిమాండ్

భగత్ సింగ్, ఆయన సహచరులు ఒకప్పుడు నివసించిన కోఠి నంబర్ 1784 ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. ఇది భారత స్వాతంత్ర్య పోరాటానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని సీనియర్ చరిత్రకారుడు రాజే అన్నారు. ప్రభుత్వం ఈ భవనాన్ని పునరుద్ధరించి, ఒక స్మారక స్థలంగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఆగ్రాలోని మన్ కామేశ్వర దేవాలయ సముదాయంలో 'రాష్ట్ర మందిరం' పేరుతో ఒక ప్రత్యేక ఆలయం ఉంది. ఇందులో భగత్ సింగ్‌తో పాటు మహాత్మా గాంధీ వంటి ఇతర స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఉన్నాయి.

## భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలను దేశం మరువదు : రాజ్యసభ ఛైర్మన్

షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్‌లకు రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం నివాళులు అర్పించారు. వారి త్యాగం భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక కీలక ఘట్టమని ఆయన తెలిపారు. వలస పాలనకు వ్యతిరేకంగా లక్షలాది మంది భారతీయులకు ఆ విప్లవ యోధులు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఆ ముగ్గురి ధైర్యం, త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదన్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని రాజ్యసభ సభ్యులకు సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. అనంతరం భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్‌లను గుర్తు చేసుకుంటూ రాజ్యసభ సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించారు.

ఉప్పల్‌లో స్వరూప్ రెడ్డి కాలనీది

# సమస్యల పరిష్కారానికి వినతి...

ప్రజావాణిలో జోనల్ అధికారిని కలిసిన కాలనీ సంక్షేమ సంఘం...


SWAROOP REDDY COLONY WELFARE ASSOCIATION
Date : 23.03.2026
To
The Zonal Commissioner
Uppal Circle, Hyd.

ఉప్పల్//**మార్చి 23 (ఆకాంక్ష) :** ఉప్పల్ పరిధిలోని స్వరూప్ రెడ్డి కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంగ మహేందర్ రెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జోనల్ అధికారి రాధిక గుప్తను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం ప్రతినిధులతో కలిసి వివరించారు.కాలనీలో మౌలిక వసతుల కొరత, స్థానిక సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. సమస్యలను జాగ్రత్తగా విన్న జోనల్ అధికారి రాధిక గుప్త సంబంధిత పై అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పంగ మహేందర్ రెడ్డి తెలిపారు.కాలనీ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు స్పందించడంతో స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అన్న వెంకటేష్, జ్ఞానేశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు...



జడ్చర్ల//**మార్చి 23 (ఆకాంక్ష) :** మిడ్జిల్ గ్రామంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించబడ్డాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, స్వామివారి సేవలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆలయ అర్చకులు వేదాంతం యుగంధరాచార్యులు బ్రహ్మత్వంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి స్నాపన తిరుమంజనం, సుదర్శన హోమం, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా పాల్గొన్న భక్తులు స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా దేవస్థానం ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు, భగవద్భక్తులు అధిక సంఖ్యలో హాజరై మహోత్సవాలను విజయవంతం చేశారు. ఆలయ ధర్మకర్త కార్యనిర్వాహకులు సాధు డాక్టర్ శ్రీనివాస రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా పాల్గొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. మహోత్సవాలకు మిడ్జిల్ గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, మిడ్జిల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కూచూరి శ్రీనివాస్ రెడ్డి, బాదేపల్లి జాతీయ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ తంగెళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, ఉరకొండ గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, విజయ్ కుమార్, పల్లె తిరుపతి, రాజేష్ తదితరులు హాజరయ్యారు.స్వామివారి బ్రహ్మోత్సవాలు గ్రామంలో భక్తి పారవశ్యాన్ని నింపాయని, ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు గ్రామ ప్రజల్లో ఐక్యతను, సనాతన సంప్రదాయాల పట్ల మరింత విశ్వాసాన్ని పెంపొందిస్తాయని భక్తులు అభిప్రాయపడ్డారు.

# గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 23 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మీట్య తండా,భీముని తండా, వసంతపూర్ గ్రామాల్లో సోమవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పశుపోషకులకు సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పశువులను వ్యాధుల బారినపడకుండా కాపాడుకోవాలని కోరారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నీరసంగా మారడంతో పాటు మేత మేయకపోవడం, కాళ్ల వద్ద వాపులు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మండల పశుసంవర్ధక శాఖ అధికారులు, మీట్య తండా సర్పంచ్ పుల్య నాయక్,వసంతపూర్ గ్రామ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీజీ సెట్‌లో మెరిసిన ముగ్గురు

# ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు....



నాగర్‌కర్నూల్//**మార్చి 23 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు టీజీ సెట్‌లో అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.లైఫ్ సైన్స్ విభాగానికి చెందిన బాదం నరేష్, ఇంగ్లీష్ విభాగానికి చెందిన ఎత్తం రమ్య రెడ్డి అలాగే కంప్యూటర్ సైన్స్ విభాగంలో టీఎస్కేసీ మెంటర్‌గా పనిచేస్తున్న రామకృష్ణ టీజీ సెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు.ఒకేసారి ముగ్గురు అధ్యాపకులు స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించడంతో కళాశాలలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, టీజీ సెట్ ఉత్తీర్ణులైన అధ్యాపకుల కృషిని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.అనంతరం వారిని శాలువా మరియు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ




కార్యక్రమంలో కళాశాల ఏఓ మహమ్మద్ ఇర్ఫాన్ అధ్యాపకులు అంజయ్య, వనిత, కోదండరాములు, రామకృష్ణ, దశరథ, ముజఫర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూనారం ఆర్‌ఓబీ భూ సేకరణ

# పనులు వేగవంతం చేయాలి...

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష...



పెద్దపల్లి//**మార్చి 23 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల పురోగతిపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కూనారం ఆర్ఓబీ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను పూర్తిచేసి సంబంధిత శాఖకు బదలాయించినట్లు తెలిపారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఆలస్యం కాకుండా ఉండేందుకు మార్గంలో ఉన్న షాపులను త్వరితగతిన ఖాళీ చేయించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆర్ఓబీ నిర్మాణం పూర్తయ్యే లోపే అప్రోచ్ రోడ్డు పనులను కూడా ముగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య, ఆర్ అండ్ బి ఈఈ భావ్‌సింగ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రైల్వే గేటు వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు,ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నాచారం మాదిగ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.72 లక్షలు మంజూరు...

శ్మశానవాటిక సమస్యలకు పరిష్కారం.. కమిటీ హర్షం...

నాచారంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల...



ఉప్పల్//**మార్చి 23 (ఆకాంక్ష) :** నాచారం గ్రామంలోని మాదిగ శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 70 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ శ్మశానవాటికలో మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, సమస్యల పరిష్కారానికి స్పందిస్తూ రూ.1.72 లక్షల నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.శ్మశానవాటికలో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో దహన సంస్కారాలు నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందని కమిటీ సభ్యులు తెలిపారు.వేచి ఉండేందుకు షెడ్ లేకపోవడం వల్ల కుటుంబ సభ్యులు, బంధువులు వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చిన్న బోరు ఉన్నప్పటికీ తగినంత నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం బాత్రూములు పాడై కూలిపోయే స్థితికి చేరుకోవడం వల్ల తీవ్ర అసౌకర్యం నెలకొన్నట్లు వివరించారు. దీంతో టెంట్లు ఏర్పాటు చేసుకుని బయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అదేవిధంగా శ్మశాన వాటికకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, లోపల లైటింగ్ లేక పోవడం వల్ల రాత్రి వేళల్లో దహన సంస్కారాలు నిర్వహించడం మరింత కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. దొంగల బెడద కూడా ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ కమిటీ సభ్యులు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించగా ఆయన వెంటనే స్పందించి కేవలం 15 రోజుల్లోనే రూ.1.72 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు కమిటీ వెల్లడించింది.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్మశానవాటిక సమస్యలను వెంటనే గుర్తించి స్పందించడం అభినందనీయమని, మంజూరైన నిధులతో మౌలిక వసతులు మెరుగుపడి గ్రామ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏర్పుల నర్సింగరావు, గౌడెల్లి శ్రీనివాస్, ఏర్పుల నాగరాజు, నూతలనకంటి రాజు, ఏర్పుల నరేందర్, అయ్యగారి రమేష్,ఏర్పుల చిన్న, ఏర్పుల రవి, ఇస్తారి పవన్, కాంగ్రెస్ నాయకులు, నాచారం గ్రామవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానంతో భార్యను బండరాయితో మోది హత్య...

మృతదేహంతో బైక్‌పై 50 కిలోమీటర్ల ప్రయాణం చేసి పొలంలో పడేసిన భర్త...

గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు..

నిందితుడు అరెస్ట్, రిమాండ్..




షాద్‌నగర్//**మార్చి 23 (ఆకాంక్ష) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను బండ రాయితో మోది హత్య చేసి, మృతదేహాన్ని బైక్‌పై దాదాపు 50 కిలోమీటర్లు తీసుకెళ్లి పొలాల్లో పడేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సోమవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ లక్ష్మీనారాయణ మీడియాకు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే గ్రామానికి చెందిన శోభ అలియాస్ శోభారాణి (33)ను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందు వివాహం ద్వారా ఒక కుమారుడు కూడా ఉన్నాడు. మొదట్లో సవ్యంగా సాగిన వారి దాంపత్య జీవితం, నర్సింలు మద్యానికి బానిస కావడంతో విభేదాలకు దారితీసింది. భర్త వేధింపులు అధికమవడంతో శోభ తన కుమార్తెతో కలిసి రంగారెడ్డి గూడెంలోని తన తల్లి వద్ద ఉంటోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు ఈ నెల 21న “నీ కొడుక్కి సైకిల్ కొనిస్తాను” అంటూ శోభను మహబూబ్‌నగర్‌కు రప్పించాడు. ఆమె తన చిన్న కుమార్తెతో కలిసి అక్కడికి చేరుకోగానే గదికి తీసుకెళ్లిన నర్సింలు, మద్యం సేవించిన అనంతరం మరోసారి గొడవకు దిగాడు. ముందుగానే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో శోభ తలపై బలంగా మోది హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం గదిలోని రక్తపు మరకలను శుభ్రం చేసిన నిందితుడు, అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని మూటకట్టి బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై ఉంచి, తన మూడేళ్ల కుమార్తెను కూడా అదే బైక్‌పై కూర్చోబెట్టుకుని రంగారెడ్డిగూడెం శివారులోని పొలం గట్టుపై పడేసి పరారైనట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో నిందితుడి క్రూరత్వం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మరుసటి రోజు ఉదయం పొలాల్లో మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి, నిందితుడి కదలికలను గుర్తించారు. సోమవారం ఉదయం లింగంపల్లిలో నర్సింలును అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన గ్రానైట్ రాయి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.ఈ కేసును అత్యంత చాకచక్యంగా, వేగంగా ఛేదించిన షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్, రాజేశ్వర్, శివరెడ్డిలను ఫ్యూచర్ సిటీ కమిషనర్, షాద్‌నగర్ డీసీపీ అభినందించారు.ఈ దారుణ ఘటనతో షాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కుటుంబ విభేదాలు, అనుమానాలు, మద్యపానం వంటి కారణాలు చివరికి ఒక మహిళ ప్రాణాన్ని బలి తీసుకోవడం విషాదకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు యుగాది కాలెండర్ ను

# ఆవిష్కరిస్తున్న వెల్దుర్తి ఎస్ఐ నరేష్.

తెలుగు యుగాది క్యాలెండర్ ఆవిష్కరణ...



వెల్దుర్తి//**మార్చి 23 (ఆకాంక్ష) :** ఆధ్యాత్మిక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కోయిలకొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం వెల్దుర్తి త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ వెల్దుర్తి ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం త్రైతశకం తెలుగు క్యాలెండర్ లను పోలీస్ సిబ్బందికి , పలువురికి వితరణ చేయడం జరిగింది.సభ్యులు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచిక లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి, తెలుగు పండుగల విశిష్టత, మరియు తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి రచించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కోయిల కొండ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు రామాంజనేయులు , మల్లికార్జున, రవికుమార్ , సురేఖ రాణి , పావని , గంగాధర్ , శివ , చెన్నకేశవులు పాల్గొన్నారు.

# పాలెం జాతీయ సెమినార్‌కు పిలుపు...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 23 (ఆకాంక్ష) :**రసాయన వ్యర్థాల నిర్వహణలో పర్యావరణహిత పరిష్కారాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 25న బిజినపల్లి మండలం పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న బయోరిమిడియేషన్ జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. సెమినార్ బ్రోచర్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యా చైర్మన్ జిట్టా బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ రసాయన కాలుష్యం ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన సమస్యగా మారిందని, బయోరిమిడియేషన్ వంటి సహజ పద్ధతులు పర్యావరణ పరిరక్షణలో కీలకమని అన్నారు. జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ శాస్త్రీయ దృక్పథంతో పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాములు సెమినార్ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, లైబ్రేరియన్ డాక్టర్ వర్కాల శ్రీనివాసులు, సెమినార్ కన్వీనర్లు డాక్టర్ సి.నాగరాజు, శివ దొడ్ల తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి వెంకటనరసునాయుడు చిత్రపటానికి

# నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులతో కళాకారులు.



వెల్దుర్తి//**మార్చి 23 (ఆకాంక్ష) :** రాయలసీమ రత్నం బిరుదాంకితుడు, రంగస్థల నటుడు, పౌరాణిక నాటక చక్రవర్తి కీర్తిశేషులు వెల్దుర్తి వెంకటనరసునాయుడు వర్ధంతి వేడుకలను మండల కేంద్రమైన వెల్దుర్తి లో ఆయన మనవడు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి జడ్పిటిసి దాది పోగు సుంకన్న సర్పంచ్ ముత్యాల శైలజ, పారిశ్రామికవేత్త తిరువీధి సాయిప్రసాద్, హెల్పింగ్ హాండ్ సొసైటీ అధ్యక్షులు హరిసింహానాయుడు, రంగస్థలం నాటక కళాకారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకటనరసునాయుడు ఆంధ్రప్రదేశ్ లోనే కాక ఇతర రాష్ట్రాలలో పౌరాణిక నాటక ప్రదర్శనలతో ఎన్నో అవార్డులు సాధించి రాయలసీమకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చాడని గుర్తు చేసుకున్నారు.తెలుగుజాతి గర్వించదగ్గ గొప్ప నటుడు రాయలసీమ రంగస్థలం రారాజు పౌరాణిక నాటక చక్రవర్తి వెల్దుర్తి వెంకటనరసునాయుడు అని కొనియాడారు. అనంతరం మండలంలోని కళాకారుల కళాకారులందరూ కలిసి వెంకటనాయుడు ఇంటి వద్ద ఉచిత నాటకాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి ఎస్టీ పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు వెంకట నాయుడు, రంగస్థల నాటక రంగం కళాకారులు వియం. గోపీనాథ్ నాయుడు, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ఛలో అసెంబ్లీకి వెళ్తుండగా బీజేపీ నాయకుల అరెస్టు...

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు...




ఓదెల//**మార్చి 23 (ఆకాంక్ష) :** ఓదెల మండలం నుంచి ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ నాయకులను పోత్కపల్లి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు . తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ నాయకులు ఆరోపించారు.బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు శనిగరపు రమేష్, మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌కు బయలు దేరారు. ఈ క్రమంలోనే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేయడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అరెస్టు అయిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శనిగరపు రమేష్, మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్, తీర్థాల కుమారస్వామి, కొంగర అనిల్, దాత రాకేష్ తదితరులు ఉన్నారు.

# సిరిసిల్ల జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు...

### ఈ-మెయిల్ ద్వారా హెచ్చరిక...
### అప్రమత్తమైన కోర్టు సిబ్బంది
### రంగంలోకి పోలీసులు, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ బృందాలు...

సిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానానికి బాంబు బెదిరింపు రావడంతో సోమవారం తీవ్ర కలకలం రేగింది. గుర్తు తెలియని వ్యక్తులు జిల్లా కోర్టు అధికారిక ఈ-మెయిల్ ఐడీకి సందేశం పంపుతూ కోర్టు ప్రాంగణంలో బాంబు అమర్చినట్లు హెచ్చరించడం ఆందోళన కలిగించింది.సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న కోర్టు సిబ్బంది మెయిల్‌ను గమనించి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు తక్షణమే పోలీసులను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రజలను, న్యాయవాదులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ పోలీసులు కోర్టు ఆవరణలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. అనంతరం డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగి కోర్టు గదులు, కార్యాలయ విభాగాలు, పరిసర ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు తదితర ప్రదేశాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాయి. గంటల తరబడి సాగిన ఈ తనిఖీల్లో ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలించారు.బాంబు బెదిరింపు సమాచారం రావడంతో కొంతసేపు కోర్టు కార్యకలాపాలపై ప్రభావం పడినట్లు తెలిసింది. భద్రతాపరమైన కారణాలతో కోర్టు పరిసర ప్రాంతాల్లోకి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై దృష్టి సారిస్తూ పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.ఈ-మెయిల్ పంపిన వ్యక్తులు ఎవరు, వారి ఉద్దేశ్యం ఏమిటి అన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైమ్ నిపుణుల సహాయంతో ఈ-మెయిల్ మూలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.బెదిరింపు నిజమా, లేక ఎవరో కావాలనే భయాందోళనలు సృష్టించేందుకు చేసిన తప్పుడు హెచ్చరికనా అన్న కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది.జిల్లా కేంద్రంలోని కీలక న్యాయస్థానానికి ఇలాంటి బెదిరింపు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. కోర్టుల వంటి ప్రజాప్రాధాన్య సంస్థల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని న్యాయవాదులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో కోర్టు భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పోలీసుల తనిఖీలు పూర్తయ్యాక మాత్రమే పరిస్థితిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### పదో తరగతి పరీక్ష కేంద్రాలను

# తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్...

రాజన్న సిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సోమవారం స్వయంగా పరిశీలించారు. సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఏ' మరియు 'బీ' వింగ్ పరీక్షా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థుల పరిస్థితిని గమనించిన కలెక్టర్, వారికి అందుతున్న కనీస సౌకర్యాల గురించి ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, సరిపడ వెలుతురు, ఫ్యాన్లు, బెంచీలు వంటి మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న అంశాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.పరీక్షల నిర్వహణలో ఎక్కడా నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్విజిలేటర్లు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ, పరీక్షా విధానాలు కచ్చితంగా అమలు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో క్రమశిక్షణ, పారదర్శకత, భద్రత విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన పరీక్షలు కావడంతో, ప్రతి అంశాన్ని బాధ్యతగా పర్యవేక్షించాలని ఆమె అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.కలెక్టర్ పర్యటనలో విద్యాశాఖ అధికారులు, పరీక్షల నిర్వహణకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

# బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి.. టీఆర్పీ ఆగ్రహం..

### సిరిసిల్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసన...

రాజన్నసిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. దండు వినోద్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీగా వెళ్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు.అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఆర్పీ నాయకులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు ప్రతి సంవత్సరం రూ.20,000 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత బడ్జెట్‌లో బీసీల కోసం కేవలం రూ.12,000 కోట్లను మాత్రమే కేటాయించడం బీసీ వర్గాలను మోసం చేయడమేనని అన్నారు.బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు దాని ప్రస్తావనే లేకుండా చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని టీఆర్పీ నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 6 శాతం మేరే నిధులు కేటాయించడం సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని ప్రశ్నించారు. తక్కువ జనాభా కలిగిన వర్గాలకు అధిక నిధులు కేటాయిస్తూ, మెజారిటీ వర్గమైన బీసీలను విస్మరించడం ఏ మాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు.బడ్జెట్‌లో బీసీలకు జరిగిన ఈ అన్యాయంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని టీఆర్పీ నాయకులు ప్రకటించారు. బీసీల హక్కులు, వాటా కోసం పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో టీఆర్పీ ముఖ్య నాయకులు దేవరాజు, కలికోట రేణుక, గుండేటి శేఖర్, కోడూరి శ్రీహరి, దూడం సత్యం, నర్మేట స్వాతి, వేణు, చిట్టిపెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

### సిరిసిల్ల కేంద్రీయ విద్యాలయంలో

# 2026-27 అడ్మిషన్ల ప్రారంభం..

### దరఖాస్తులకు ఆహ్వానం...




రాజన్నసిరిసిల్ల//మార్చి 23 (ఆకాంక్ష) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-2027 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎన్. శేష ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మొదటి తరగతిలో ప్రవేశం పొందదలచిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం కేంద్రీయ విద్యాలయ సంస్థ అధికారిక అడ్మిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రెండో తరగతి నుంచి పై తరగతుల వరకు ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. పాఠశాల పనివేళల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.40 గంటల వరకు సంబంధిత దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.అడ్మిషన్లకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం పాఠశాల కార్యాలయాన్ని పనివేళల్లో నేరుగా సంప్రదించవచ్చని, అలాగే పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. సిరిసిల్ల మరియు పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# రైలు కిందపడి ఇద్దరు యువకుల మృతి...

### స్నేహితుల ఆత్మహత్యగా అనుమానం...
### కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు...

తిరుపతి//మార్చి 23 (ఆకాంక్ష) :తిరుపతి జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని తడ మండలం కొండూరు సమీపంలో రైలు కిందపడి ఇద్దరు స్నేహితులు మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేర్నాడుకు చెందిన సునీల్, పిండిపాలేనికి చెందిన కల్యాణ్ అనే ఇద్దరు యువకులు కొండూరు వద్ద రైల్వే పట్టాలపై రైలు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల వివరాలను సేకరించిన పోలీసులు,వారి బంధువులకు సమాచారం అందజేశారు. ఈ ఘటన ఆత్మహత్యగా భావిస్తున్నప్పటికీ, అసలు కారణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో తడ మండలం పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు స్నేహితులు ఒకేసారి మృతి చెందడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.ం

### భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో

# యువత ఉద్యమించాలి: గుజ్జుల సత్యనారాయణ రెడ్డి...




గోదావరిఖనిటౌన్//మార్చి 23 (ఆకాంక్ష) : గోదావరిఖని ఎన్టీపీసీ కార్యాలయంలో సోమవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పార్టీ నాయకులు నివాళులు అర్పించారు.సభలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ పరాయి పాలనకు వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛ,స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వారి మరణానికి 95 సంవత్సరాలు పూర్తయినా దేశంలో నిజమైన స్వాతంత్ర్యం సాధ్యపడలేదని అన్నారు.దేశానికి భగత్ సింగ్‌లాంటి పోరాట చైతన్యం కలిగిన యువతరం అవసరమని పేర్కొన్న ఆయన, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల దేశ సంపద కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తోందని ఆరోపించారు. దేశ వనరులను, సంపదను పెట్టుబడిదారులకు అప్పగించే ప్రభుత్వాలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ శక్తుల ఆధిపత్య పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులను సృష్టిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించాల్సిన భారత ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో రాష్ట్రంలో చమురు, గ్యాస్ ధరలు పెరుగుతూ ప్రజలపై భారంగా మారుతున్నాయని, మరోవైపు నిరుద్యోగం పెరిగి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇచ్చే హామీలు అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. దేశంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్య విలువల పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య ఉద్యమానికి యువత సిద్ధం కావాలని, భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో దేశ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులు తోకల రమేష్, ఈసంపల్లి రాజేందర్, మార్త రాములు, కలువల రాయమల్లు, చిలుక రాజు, బత్తుల రాజన్న, అంబాల కిష్టస్వామి, కోండ్ర రవి తదితరులు పాల్గొన్నారు.

### సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు

# యువత ముందుకు రావాలి...




గోదావరిఖనిటౌన్//మార్చి 23 (ఆకాంక్ష) : అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య విధానాలను వ్యతిరేకిస్తూ, షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖనిలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా తోకల రమేష్, ్ఖజ× పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆధిపత్యం కోసం అమెరికా సామ్రాజ్యవాదం యుద్ధోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. వివిధ దేశాల సహజ వనరులు, ముఖ్యంగా చమురు నిల్వలు, ఆర్థిక వనరులు, మానవ వనరులపై ఆధిపత్యం సాధించేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. యుద్ధాలు ఎప్పుడూ రెండు దేశాలకు నష్టమేనని, అయితే ముఖ్యంగా పేదలు, కార్మికులు, సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిని, పన్నుల భారం చివరికి పేదలపైనే పడుతుందని, వలసలు పెరిగి సామాజిక అసమానతలు మరింత తీవ్రమవుతాయని అన్నారు. ఇటువంటి పరిణామాలను భగత్ సింగ్ తన కాలంలోనే స్పష్టంగా హెచ్చరించారని గుర్తు చేశారు. అందువల్ల యుద్ధ వ్యతిరేక స్వరాన్ని బలపరచడానికి విద్యార్థులు, యువకులు, మేధావులు రోడ్డుమీదికి రావాలని పిలుపునిచ్చారు.దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేదల పక్షాన నిలవకుండా అమెరికా, ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద శక్తుల వైపు మౌన మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. యుద్ధం ఎవరుచేసినా తప్పేనని స్పష్టంగా ప్రకటించకుండా ఉండటం ఆందోళనకరమన్నారు. అదే సమయంలో మోడీ ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చలేదని, ముఖ్యంగా ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అమలు చేయలేదని ఆరోపించారు. విద్యారంగానికి నిధుల కేటాయింపులు తగ్గించడం ద్వారా యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నారని అన్నారు.యువత, విద్యార్థులు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని, సమాజంలో అన్యాయాలపై సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా, ్ఖజ× పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్‌తో పాటు కొయ్యడ వెంకటేష్, నీలం మదనమ్మ, గుండ్ల పోశం, అంజయ్య, లక్ష్మీనారాయణ, కుమార్, శంకర్, రాజేశ్వరి, ఆర్. శ్రీనివాస్, ఎం. రాజయ్య, వసంత, విజయభాను తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి సర్దార్ భగత్ సింగ్...




గోదావరిఖని//మార్చి 23 (ఆకాంక్ష) : స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భాస్కరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి, కార్పొరేటర్ మార్కపురి సూర్య మరియు జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో తన ప్రాణాలను అర్పించి యువతకు చిరస్మరణీయ ఆదర్శంగా నిలిచిన మహాయోధుడు భగత్ సింగ్ అని కొనియాడారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలకుల వెన్నులో వణుకు పుట్టించేలా పోరాట పటిమ కనబరిచిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని తెలిపారు. విద్యార్థి దశ నుంచే స్వేచ్ఛా సంగ్రామంలో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరిన ధీరుడు ఆయనేనని పేర్కొన్నారు.భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను 1931 మార్చి 24న ఉరితీయాలని నిర్ణయించినప్పటికీ, చట్టాలకు విరుద్ధంగా మార్చి 23 రాత్రే ఉరితీశారని వారు గుర్తు చేశారు. ఆ ఘటనపై దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందని, వేలాది మంది ప్రజలు జైలు పరిసరాల్లో నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. భగత్ సింగ్ త్యాగాన్ని విస్మరించకుండా దేశ యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా "భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ పథకం" అమలు చేసి ప్రతి నిరుద్యోగికి ఉద్యోగావకాశాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే భగత్ సింగ్‌ను అధికారికంగా స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మత ఛాందసవాద రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థి, యువజనులు ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. అదే సమయంలో యువతను ప్రభావితం చేస్తున్న డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి సామాజిక విపత్తుల నుండి దూరంగా ఉండాలని సూచించారు. రామగుండం ఖని ప్రాంతంలో భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భావితరాలకు ఆయన స్ఫూర్తిని చేరవేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి సురేందర్, ఆసాలు నవీన్, రాణవేణి సుధీర్, సాధుల శివ, మాతంగి సాగర్, అనూప్ సాయి, రిషి తదితరులు పాల్గొన్నారు.

### పలువురు కుటుంబాలను

# పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే...



ఖమ్మం/మార్చి 23 (ఆకాంక్ష) : ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలో సోమవారం వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ పలువురు కుటుంబాలను పరామర్శించారు. భాగ్యనగర్ తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ వాంకుడొత్ జగన్ నాయక్ సతీమణి జమున ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, వారి నివాసానికి వెళ్లిన రాములు నాయక్ ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం పాత కమలాపురం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన సర్పంచ్ తేజవత్ బాబురావు నివాసానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఇదే క్రమంలో అదే గ్రామానికి చెందిన కట్ల భద్రమ్మ ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో తాము అండగా ఉంటామని తెలిపారు.



ప్రాంతంలోని వివిధ కుటుంబాలను వ్యక్తిగతంగా పరామర్శించడం ద్వారా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ మానవీయత చాటుకున్నారని స్థానికులు పేర్కొన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధరవత్ పాండ్య నాయక్, మండల రైతు బంధు మాజీ కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఇల్లెందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడొత్ నరేశ్, టీడీపీ పాత కమలాపురం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు కొత్త తిరుపతయ్య, కాటన్నీ రామారావు, తోటకూరి తిరుపతయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, కొడిమళ్ల వెంకన్న, కొర్ర నాగేశ్వరరావు, తేజవత్ కిషన్, సపావట్ కోటి, పాత కమలాపురం యూత్ అధ్యక్షుడు భూక్య నందు, భూక్య రవి, శ్రావణ్, రాజేష్, కోటి, దారావత్ వెంకట్, గిరిజన సంఘం నాయకులు భూక్య రాంకిషోర్ నాయక్, బానోతు రాజేష్ నాయక్, ఎన్టీఆర్ సేవా సమితి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త వెంకట్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# మాగంటి గోపీనాథ్ కుటుంబంలో మరో విషాదం...



హైదరాబాద్//మార్చి 23 (ఆకాంక్ష) : మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబాన్ని మరో విషాదం చుట్టు ముట్టింది. హైదరాబాదులోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్‌పై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన కుమార్తెలు ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెద్ద కుమార్తె అక్షర తీవ్రంగా గాయపడగా, ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రెండో కుమార్తె దిశర స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.తెలిసిన వివరాల ప్రకారం, మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ వాహనం ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి ఇద్దరినీ వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వారికి అత్యవసర చికిత్స అందుతున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.ఈ ఘటనలో అక్షర తీవ్ర గాయాల పాలవడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు దిశర స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడటం కొంత ఊరటనిచ్చినప్పటికీ, కుటుంబంలో నెలకొన్న విషాద వాతావరణం అందరినీ కలచివేస్తోంది.ప్రాథమిక విచారణలో వాహనం అతివేగంతో ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై మరింత సమాచారం సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో వాహనం ఎలా అదుపు తప్పింది, మరే ఇతర వాహనాల ప్రమేయం ఉన్నదా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఇప్పటికే కుటుంబంలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఈ తాజా ప్రమాదం మరింత విషాదాన్ని మిగిల్చింది. మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యుల పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, సన్నిహితులు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. అక్షర ఆరోగ్యం మెరుగుపడి సురక్షితంగా కోలుకోవాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

# ఖానాపూర్ మండలంలో నిలిచిన అభివృద్ధి పనులు...

### మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు సర్పంచ్‌ల వినతి...



వరంగల్//మార్చి 23 (ఆకాంక్ష) : వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపడుతున్న మెటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించిన నిధులు నిలిపి వేయడంతో తొమ్మిది గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచి పోయాయని స్థానిక సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వారు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలకు రావాల్సిన అభివృద్ధి నిధులను డివిజన్ యూనిట్‌గా మార్చడం వల్ల గ్రామాలకు తగిన న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన పనిదినాలకు సంబంధించిన 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు.నిధుల కొరత కారణంగా గ్రామాల్లో ప్రాథమిక సదుపాయాల అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు నిలిచిపోవడం గ్రామీణ ప్రజలపై భారంగా మారిందన్నారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, నిలిచి పోయిన పనులను పునఃప్రారంభించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కలెక్టర్‌ను కోరారు.వినతి పత్రం సమర్పించిన వారిలో ఖానాపూర్ సర్పంచ్ దాసరి రమేష్, ధర్మారావుపేట్ సర్పంచ్ ఎం. వెంకన్న, మనుబోతులగడ్డ సర్పంచ్ ఏ. శ్రీలత అశోక్, నానితండ సర్పంచ్ జ్యోతి, కోడ్తిమాట్ తండా సర్పంచ్ ఎల్. వసంత తదితరులు ఉన్నారు.

# భగత్ సింగ్, రాజ్‌గురు,సుఖదేవ్‌లకు ఘన నివాళులు...



మెదక్//మార్చి 23 (ఆకాంక్ష) : శహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లాలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యాలయంలో విప్లవ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆలోచనలు కేవలం స్ఫూర్తిగా మాత్రమే కాకుండా, శోషణ, దోపిడీకి వ్యతిరేకంగా నిరంతర పోరాటానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమానత్వం,సామాజిక న్యాయం సాధన కోసం విద్యార్థులు, యువత విప్లవ భావజాలంతో ముందుకు రావాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు.అన్యాయం, అసమానతలపై మౌనం పాటించడం సమాజానికి మేలు చేయదని, ప్రతిఘటనే ప్రజాస్వరం కావాలని వారు పిలుపునిచ్చారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం విప్లవ సిద్ధాంతాలతో, అచంచల సంకల్పంతో పోరాటం కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భవాని, కవిత, రాణి తదితర నాయకులు పాల్గొని విప్లవ వీరులకు నివాళులర్పించారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం..

## అమలుకు సిద్ధమైన కేంద్రం...




న్యూఢిల్లీ//మార్చి 23 (ఆకాంక్ష) : దేశంలో కొత్త ఆదాయ పన్ను చట్టం-2025 ను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ కొత్త చట్టం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. అయితే ఈ మార్పు గురించి ప్రస్తుత పన్ను రిటర్నుల ఫైలింగ్‌పై చెల్లింపుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టంచేశారు. ఈ ఏడాది ఫైలింగ్ ప్రక్రియ మొత్తం ఇప్పటికే అమల్లో ఉన్న 1961 చట్టం (1961-చాష్) ప్రకారమే కొనసాగుతుందని హామీ ఇచ్చారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు ఆర్జించే ఆదాయానికి పాత చట్టం ప్రకారమే పన్నులు లెక్కించి, రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి సంపాదించే ఆదాయానికి మాత్రమే కొత్త చట్టం వర్తిస్తుందని నిపుణులు వివరించారు. ప్రభుత్వం ఈ మార్పును దశలవారీగా, స్పష్టమైన ప్రణాళికతో అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు 'ఆదాయపు పన్ను నిబంధనలు-2026' ను నోటిఫై చేసింది. దీని ప్రకారం వేతన జీవులకు ఊరటనిచ్చే పలు మార్పులు చేశారు. ఇంటి అద్దె అలవెన్స్ మినహాయింపు పరిమితిని పెంచారు. 50 శాతం హెచ్ఆర్ఏ స్లాబులోకి మరిన్ని నగరాలను చేర్చారు. పిల్లల ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను నెలకు రూ.3,000, హాస్టల్ అలవెన్స్‌ను నెలకు రూ.9,000 వరకు పెంచారు. అదే సమయంలో హెచ్ఆర్ఏ, ఇతర పన్ను తగ్గింపుల కోసం డాక్యుమెంటేషన్, డిక్లరేషన్ నిబంధనలను కఠినతరం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా 'ఫైనాన్షియల్ ఇయర్', 'అసెస్‌మెంట్ ఇయర్' అనే పదాల స్థానంలో 'ట్యాక్స్ ఇయర్' అనే ఒకే పదాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్‌ను సులభతరం చేసేందుకు పన్ను ఫారమ్‌లను కూడా పూర్తిగా మార్చి, కొత్త నంబర్లను కేటాయించనున్నారు. దీనివల్ల ఫైలింగ్ ప్రక్రియలో స్పష్టత పెరిగి, సందిగ్ధత తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధంపై ట్రంప్ కీలక ప్రకటన..

## ఉద్రిక్తతలకు తెరపడినట్టేనా..!



న్యూఢిల్లీ//మార్చి 23 (ఆకాంక్ష) : పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో చర్చలు మంచి వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపిన ట్రంప్ తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నట్టు చెప్పారు. సోమవారం ట్రుత్ సోషల్ పోస్ట్‌లో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు నిలిపివేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ట్రంప్ ప్రకటనతో మూడు వారాలకు పైగా ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడే అవకాశముంది. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు ఇరాన్‌కు 48 గంటల సమయం ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్ యుద్ధంపై కీలక ప్రకటన చేశారు. మూడు వారాకులపైగా ఇరాన్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్న ట్రంప్.. తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నట్టు తెలిపారు. 'అమెరికా, ఇరాన్ మధ్య గత రెండు రోజులుగా మంచి వాతావరణంలో చర్చలు జరుగుతున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నా. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాల రక్షణ గురించీ చర్చలు జరుగుతున్నాయి. ఈ వారం మొత్తం ఇరుదేశాల మధ్య పలు అంశాల మీద లోతైన చర్చలు జరగనున్నాయి. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు ఫలప్రదంగా సాగుతున్నందున.. ఇరాన్ పవర్ ప్లాంట్లు, ఇంధన వనరులపై ఐదు రోజుల పాటు ఎలాంటి సైనిక దాడులకు పాల్పడవద్దని మా యుద్ధ విభాగానికి ఆదేశాలిచ్చాను. ఈ విషయంపై ఆసక్తి చూపిస్తున్నందుకు మీ అందరికీ ధన్యవాదాలు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# సెల్ టవర్ నిర్మాణానికి గ్రామస్తుల అడ్డుకట్ట...



కొత్తగూడెం//మార్చి 23 (ఆకాంక్ష) : బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ప్రతిపాదిత సెల్ టవర్ నిర్మాణ పనులను గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టాలని నిర్వాహకులు నిర్ణయించగా, దీనికి స్థానికులు తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నిత్యం వస్తుండటంతో ఆ ప్రదేశంలో సెల్ టవర్ నిర్మాణం అనుచితమని గ్రామస్తులు పేర్కొన్నారు. సెల్ టవర్ వల్ల రేడియేషన్ ప్రభావం ఉండే అవకాశముందని, దానివల్ల చిన్నారులు, గర్భిణులు మరియు ఇతర గ్రామస్తుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ మధ్యలో కాకుండా గ్రామానికి చివరన, జనావాసాలకు దూరంగా ఉన్న ప్రదేశంలో టవర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సోమవారం టవర్ పునాది పనులు ప్రారంభించేందుకు యంత్రాలతో గ్రామానికి వచ్చిన నిర్వాహకులను గ్రామస్తులు అడ్డుకుని పనులు నిలిపివేశారు. జనావాసాల మధ్య టవర్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. గ్రామ ప్రజల అభ్యంతరాల నేపథ్యంలో నిర్వాహకులు నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం కంటే ఏ నిర్మాణ పనులూ ముఖ్యంకాదని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అంగన్‌వాడీ సమీపంలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేసి, ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని కోరారు. లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పాలమూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పిచ్చి కుక్క దాడి..

## ఆరుగురికి తీవ్ర గాయాలు...

మహబూబ్‌నగర్//మార్చి 23 (ఆకాంక్ష) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులపై పిచ్చి కుక్క దాడి చేయడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి భద్రత, పారిశుధ్య నిర్వహణపై ఈ ఘటన తీవ్ర ఆందోళనకు దారితీసింది. అర్ధరాత్రి సమయంలో ఆస్పత్రి ప్రాంగణంలో రోగులతో పాటు ఆరు బయట నిద్రిస్తున్న వారి సహాయకులపై పిచ్చి కుక్క మొరుగుతూ ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో పలువురికి గాయాలు కావడంతో ఆస్పత్రి ప్రాంగణంలో భయాందోళన నెలకొంది. చికిత్స కోసం వచ్చిన వారే ఆస్పత్రి ఆవరణలో అసురక్షిత పరిస్థితులను ఎదుర్కొవాల్సి రావడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారి తన తల్లిదండ్రులతో కలిసి అర్ధరాత్రి సమయంలో అంబులెన్స్‌లో ఆస్పత్రికి చేరుకుంది. అంబులెన్స్ నుంచి దిగిన ఆ చిన్నారిపైకి కూడా పిచ్చి కుక్క దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చిన్నారిని రక్షించేందుకు ప్రయత్నించిన ఆమె తండ్రిపై కుక్క తీవ్రంగా దాడి చేసి కరిచినట్లు సమాచారం. ఈ ఘటన అక్కడున్న వారిని కలవరపరిచింది. గత కొంతకాలంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి కట్టడి చర్యలు చేపట్టడం లేదని మండి పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రి వంటి కీలక ప్రాంతంలో కూడా వీధి కుక్కల సంచారం అదుపులో లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు అంటున్నారు. మరో వైపు, కుక్క దాడి జరిగిన తర్వాత ఆస్పత్రి ప్రాంగణంలో రక్తపు మరకలు కనిపించినప్పటికీ వాటిని వెంటనే శుభ్రపరిచే సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడం పట్ల బాధితుల బంధువులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణ భద్రతతో పాటు ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత విషయంలో కూడా యాజమాన్యం విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి ఆస్పత్రి ప్రాంగణంలో వీధి కుక్కల సంచారాన్ని అరికట్టడంతో పాటు రోగులు, వారి సహాయకులకు భద్రత కల్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి యాజమాన్యం, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## మార్చి 28 నాటికి నరేగా అభివృద్ధి

# పనులు పూర్తి చేయాలి...



పెద్దపల్లి//మార్చి 23 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలో నరేగా ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల 28 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నరేగా కింద కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నరేగా పథకం కింద రూ.25.77 కోట్ల వ్యయంతో మొత్తం 398 సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులన్నింటినీ మార్చి 28 నాటికి పూర్తి చేసి, నెలాఖరు లోపు రూ.14 కోట్ల బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రతి దశను అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో నరేగా పనులు కీలకంగా నిలుస్తాయని, అందువల్ల పనుల నాణ్యతతో పాటు గడువులోపు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. సమీక్ష సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.ద

# గొల్ల కాపరుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి...

## కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా గొంగడి ధర్నా నిర్వహించిన గొల్ల కాపరుల సంక్షేమ సంఘం...




పెద్దపల్లి//మార్చి 23 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గొల్ల కాపరుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గొల్ల కాపరుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో వినూత్నంగా గొంగడి ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గొల్ల కాపరులు తమ సంప్రదాయ దస్త్రమైన గొంగడి ధరించి నిరసనలో పాల్గొనడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గొల్లలు, మేకల పెంపకాన్ని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న కాపరుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ స్థలాల పరిరక్షణ, గొల్లల పెంపకానికి సంబంధించిన సబ్సిడీల విడుదల, పశువైద్య సేవల విస్తరణ వంటి కీలక అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొల్ల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలారపు పర్వతాలు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పెద్దపల్లి జిల్లాలో గొల్ల కాపరులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ యార్డుల అభివృద్ధి, పశువైద్య సేవలు, ప్రభుత్వ పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం నెలకొందని వారు ఆరోపించారు. జిల్లాలోని గొల్లలు మేకల మార్కెట్ యార్డ్ స్థలాలకు వెంటనే సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, మార్కెట్ యార్డులకు నీరు, నీడ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఎలిగేడు, ధర్మారం మండలాలకు సంబంధించిన గొల్లలుమేకల మార్కెట్ యార్డ్ స్థలాల కేటాయింపులపై జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను అందించాలని కోరారు. అలాగే కుందనపల్లి గ్రామంలోని జిల్లా గొల్లలుమేకల మార్కెట్ యార్డ్ స్థలంలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి, ఫెన్సింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మార్కెట్ యార్డ్ నిధుల్లో మిగిలి ఉన్న రూ.4.50 లక్షలతో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ర్యాంపుల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని, గొల్ల కాపరులకు సంబంధించిన ఎన్ఎల్ఎం పథకం సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి జిల్లాలో పశువైద్య సేవలను విస్తరించేందుకు కొత్త సబ్‌సెంటర్లను ఏర్పాటు చేసి, అవసరమైన పశువైద్యులు మరియు సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఒగ్గు కళాకారుడు నర్ర సతీష్ తన బృందంతో కలిసి కళారూపం ద్వారా గొల్ల కాపరుల సమస్యలను హృదయానికి హత్తుకునేలా వినిపించారు. గొంగడి పరిచి, పబ్బతి పట్టి "మా మార్కెట్లను మాకు ఇస్తూ మా ఉపాధిని కాపాడండి" అంటూ వేడుకోవడం నిరసనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాము లేవనెత్తిన సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించకపోతే గొల్లలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందే మరింత ఉధృతంగా ధర్నా నిర్వహిస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, నాయకులు దాడి చంద్రమౌళి యాదవ్, వేల్పుల రామ్మూర్తి యాదవ్, తాత సదానందం, తమ్మినవేణి కొమురయ్య, అట్ల లక్ష్మయ్య, నూనేటి సంపత్ యాదవ్, ఆవుల లత, రాములు యాదవ్, ఎలుక కొమురయ్య యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, ఆసరి రాయమల్లు యాదవ్, సింగారపు రవికుమార్ యాదవ్, సనేంద్ర కొమురయ్య యాదవ్, పర్స సమయ్య యాదవ్, అట్ల సాగర్, ఆవుల సంతు, కొమ్మ ఐలయ్య, మల్లెత్తుల కనకయ్య, గోపు చంద్రయ్య, నాగరాజు, మంద స్వామి, పోలాజ్, నక్క కొమురయ్యతో పాటు పెద్ద సంఖ్యలో గొల్ల కురుమలు, గొల్ల కాపరులు పాల్గొన్నారు. ఇదే విషయంపై మరింత ఘాటు హెడ్‌లైన్‌తో మరో వెర్షన్ కూడా తయారు చేసి ఇస్తాను.



# డైరెక్టర్, నిర్మాత వేణు ఊడుగులను ఘనంగా సన్మానించిన ఉప్పరపల్లి గ్రామస్తులు...

## సినీ రంగంపై ఆసక్తి ఉన్న వారికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తా...

## లంబాడిపల్లె తరహాలోనే ఉప్పరపల్లికి కూడా ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తా... వేణు ఊడుగుల



హైదరాబాద్//మార్చి 23 (ఆకాంక్ష) : సినిమా రంగంలో దర్శకుడు, నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు పొందిన వేణు ఊడుగులును ఉప్పరపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇటీవల "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని నిర్మించి విజయాన్ని అందుకోవడంతో పాటు, తెలంగాణ ఉత్తమ చిత్రంగా గద్దర్ అవార్డు సాధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, బంధువులు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వేణు ఊడుగుల కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ప్రస్తుత సర్పంచ్ చిలపాక మొగిలి, మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, ఊడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థాయి నుంచి కష్టపడి సినీ రంగంలో ఈ స్థాయికి ఎదిగిన వేణు ఊడుగుల పలువురికి ఆదర్శమని, ముఖ్యంగా గ్రామ యువతను సినీ రంగంలో ప్రోత్సహించడం అభినందనీయమని సమన్వయకర్త పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. గ్రామానికి సేవ చేయాలనే ఆలోచన వేణు ఊడుగులకు రావడం ఆనందదాయకమని సర్పంచ్ చిలపాక మొగిలి పేర్కొన్నారు. ఆయన తండ్రి చూపిన మార్గంలోనే వేణు ముందుకు సాగుతూ గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 1న గ్రామంలో జరిగే రాములవారి కల్యాణానికి వేణు ఊడుగులు హాజరుకావాలని ఆహ్వానించగా, ఆయన సమ్మతించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వేణు ఊడుగుల మాట్లాడుతూ, తన గ్రామానికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. సినిమా రంగంలోకి రావాలనుకునే వారికి తన ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని చెప్పారు. గ్రామ ప్రజలతో కలిసి త్వరలోనే ఒక సినిమా తీసే ఆలోచన ఉందని తెలిపారు. లంబాడిపల్లె గ్రామం తనకు ఆదర్శమని, అదే తరహాలో ఉప్పరపల్లికి కూడా ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతిభ ఉన్న యువతను ప్రోత్సహించి, సినీ రంగ ప్రముఖులను గ్రామానికి తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలపాక మొగిలి, మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్, ఊడుగుల శ్రీనివాస్, చింతల శ్యామ్ సుందర్ రెడ్డి, ఎం.డి. భాషామియా, కుక్కల కుమార్, చింటెట్టి క్రాంతి, అందే శంకర్, మేరుగు కుమారస్వామి, ఊడుగుల రిషిత్, అనుమాండ్ల మధు, బొబ్బల సృజన్, ఎం.డి. హైమద్, గుల్లపెల్లి శ్రీనివాస్, పల్లకొండ రవి, పల్లకొండ ఎల్లస్వామి, దామరకొండ రాజు, ఆరెల్లి లక్ష్మణ్, కొనరెడ్డి వర్షిత్, రాజ్‌కుమార్, పులి రంజిత్, ఉడుతల రాజు, మంద సందీప్ తదితరులతో పాటు గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ఆకస్మిక తనిఖీ...

## అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి...

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



పెద్దపల్లి//మార్చి 23 (ఆకాంక్ష) : పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పనితీరు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యాలయాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఫైల్‌కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యాలయాల్లో నిరుపయోగంగా పేరుకుపోయిన పాడైన స్కానర్లు, ప్రింటర్లు మరియు ఇతర సామాగ్రిని వెంటనే తొలగించాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయాల నిర్వహణలో క్రమబద్ధతతో పాటు వినియోగంలో లేని వస్తువులను తొలగించడం ద్వారా పనిచేసే వాతావరణం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను అనవసరంగా ఎక్కువసేపు వేచిచూడనివ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వారి నుంచి అందిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వానికి తావులేకుండా స్పందనాత్మక పరిపాలన అందించాలని ఆయన సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జడ్చర్లలో మృతురాలి కుటుంబానికి

# గ్రామ సర్పంచ్ ఆర్థిక చేయూత...



జడ్చర్ల//మార్చి 23 (ఆకాంక్ష) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరిధిలోని మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జాటవత్ పూజ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి గ్రామ సర్పంచ్ డోలు మంగమ్మ శ్రీనివాసులు ఆర్థిక సహాయం అందజేసి మనవత్వాన్ని చాటుకున్నారు. మృతురాలి కుటుంబం విషాదంలో ఉన్న విషయం తెలుసుకున్న సర్పంచ్ డోలు మంగమ్మ శ్రీనివాసులు వెంటనే స్పందించి, అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 నగదు సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు సర్పంచ్ చేసిన సహాయాన్ని అభినందించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో గ్రామ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. సర్పంచ్ చేసిన ఈ సహాయం మృతురాలి కుటుంబానికి కొంతమేర ఊరటనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సర్పంచ్ లింభ్య నాయక్, శెంకర్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, జక్కా ఆంజనేయులు, గొడుగు రాఘవేందర్, బాధ్య నాయక్, గోపి, చందు నాయక్, ఠాగూర్ నాయక్, జాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి షాహిద్ భగత్ సింగ్...



నాగర్‌కర్నూల్//మార్చి 23 (ఆకాంక్ష) : యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన షాహిద్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువతకు మార్గం చూపిన అతి చిన్న వయస్సు గల మహనీయుల్లో షాహిద్ భగత్ సింగ్ ఒకరని అన్నారు. చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసి ఉరితాడును ముద్దాడిన ధీరుడు భగత్ సింగ్ అని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి, ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల త్యాగాలను యువత స్మరించుకోవడంతో పాటు వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి ప్రసంగంలో వర్ధన్ పర్వతాలు మాట్లాడుతూ, భగత్ సింగ్ దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన విప్లవ యోధుడని కొనియాడారు. పార్లమెంట్‌లో భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని, భగత్ సింగ్ చూపిన దారిలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, తారాసింగ్, జిల్లా నాయకులు మధు, మల్లికార్జున్, సత్యనారాయణ, శివతో పాటు మహిళా సంఘం నాయకురాళ్లు పొదిల లక్ష్మి, శ్రవణి, పార్వతి, అలివేలు, వెంకటమ్మ, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ జిల్లాలో కెవిపిఎస్ 2026 డైరీ ఆవిష్కరణ...

## దళితుల చైతన్యానికి ఇలాంటి సంఘాలు తోడ్పడాలి...

## అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్...



నాగర్‌కర్నూల్/మార్చి 23 (ఆకాంక్ష) : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రూపొందించిన 2026 సంవత్సర డైరీని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సంఘాలు ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా దళితుల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) వంటి అంశాలపై సమగ్ర సమాచారం డైరీలో పొందుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. దళితుల్లో చైతన్యం పెంపొందించేందుకు, హక్కులపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సంఘాలు ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిజాల పరుశరాములు, జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, ఉపాధ్యక్షులు కేతపల్లి సత్యనారాయణ, గుంపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో అవినీతి పరిపాలనను కొనసాగించలేరు...



జడ్చర్ల//మార్చి 23 (ఆకాంక్ష) : అవినీతి, అరాచకాలు, కమిషన్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, అలాంటి పాలనను అక్రమ అరెస్టులు, హౌస్ అరెస్టులతో కొనసాగించడం సాధ్యం కాదని మిడ్జిల్ మండల బీజేపీ అధ్యక్షుడు నరేష్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన తనను సోమవారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా నరేష్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నిరసనలు, పోరాటాలు సహజమని, వాటిని అడ్డుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో పేదల కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం కమిషన్ల పాలనలో మునిగిపోయిందని నరేష్ నాయక్ విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులు, పోలీసు నిర్బంధాలు, బెదిరింపులతో బీజేపీ నాయకుల పోరాట పటిమను తగ్గించలేరని, ప్రజా సమస్యలపై తమ ఉద్యమం మరింత ఉద్ధృతం అవుతుందని ఆయన హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, అరాచక, ప్రజావ్యతిరేక విధానాలపై బీజేపీ అన్ని స్థాయిలలో పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ హౌస్ అరెస్టు ఘటన స్థానిక బీజేపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తోందని పార్టీ నేతలు మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

### అంబేద్కర్ కాంస్య విగ్రహానికి

## ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి రూ.2 లక్షల సహాయం...



జడ్చర్ల//మార్చి 23 (ఆకాంక్ష) : మిడ్జిల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా అందజేసినట్లు అంబేద్కర్ సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షులు బరిగెల వెంకటయ్య తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని కలిసి విగ్రహ ఏర్పాటుకు సహకారం కోరగా వెంటనే స్పందించి నగదు రూపంలో రూ. 2 లక్షలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాంస్య విగ్రహ నిర్మాణానికి మొత్తం రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం ఉత్సవ కమిటీ, సంఘం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గారి సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### భగత్‌సింగ్ కలలను సాకారం చేయడానికి

## యువత ముందుకు రావాలి...




వరంగల్,//మార్చి 23 (ఆకాంక్ష) : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ, భగత్‌సింగ్ కలలుగన్న కుల, మత భేదాలు లేని సమసమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లాలని సూచించారు. మతోన్మాద రాజకీయాలను ఎదుర్కొని సెక్యులర్, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీఎన్ఈజీఏ చట్టం తీసుకురావడంతో పాటు పాఠ్యాంశాల్లో భగత్‌సింగ్ జీవిత చరిత్రను చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం...

### రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్...




షాద్ నగర్//మార్చి 23 (ఆకాంక్ష) : అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందడుగు వేసి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని తెచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఓబిసి సెల్ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఓబీసీ సెల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే ముందుకు సాగుతుందని, అందులో భాగంగానే ప్రత్యేక ఓబీసీ సెంటర్ ఏర్పాటుచేసి తనకు అవకాశం కల్పించిందని అన్నారు. పార్టీ తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామీణ స్థాయిలో బడుగు బలహీన వర్గాల నాయకత్వాన్ని పెంచి చట్టసభల్లో వారికి ప్రాధాన్యత లభించేలా, రాజ్యాధికారం చేకూరేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. బలహీన వర్గాల్లో పుట్టినప్పటికీ తాను 25 సంవత్సరాలుగా యాక్టివ్ పాలిటిక్స్ లో ఉన్నానని, ఈరోజు ఎమ్మెల్యేగా ఉన్నానంటే అది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశమేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో నాయకత్వ లక్షణాలను పెంచి సర్పంచులుగా, జడ్పిటిసిలుగా, ఎంపీటీసీలుగా అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. బలహీనవర్గాలకు అధికారాన్ని ఇప్పించడం ద్వారా ప్రజాస్వామ్యం అపహాస్యం కాకుండా కాపాడుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు..

### బాలానగర్ చౌరస్తాలో

## అంబేద్కర్ విగ్రహం తరలింపు యత్నంపై ఆందోళన...



జడ్చర్ల//మార్చి 23 (ఆకాంక్ష) : బాలానగర్ మండల కేంద్రంలోని చౌరస్తాలో దశాబ్దాలుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణ పేరుతో తరలించే యత్నం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘం నాయకులు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం, అంబేద్కర్ విగ్రహం కేవలం ఒక విగ్రహం మాత్రమే కాకుండా అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా తరలించేందుకు ప్రయత్నించడం అన్యాయమని మండిపడ్డారు. రోడ్డు విస్తరణ అవసరం ఉన్నా, విగ్రహాన్ని గౌరవప్రదంగా ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రదేశంలోనే ప్రతిష్టించాలని వారు స్పష్టం చేశారు. ఒకవేళ తరలింపు తప్పనిసరి అయితే, సంత రోడ్డులోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, దళిత సంఘాల నాయకులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని హెచ్చరించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ గౌరవం విషయంలో రాజీ ప్రసక్తే లేదని, విగ్రహాన్ని ప్రస్తుత స్థలం నుంచి కదిలించే ప్రయత్నం చేసినా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని నాయకులు తెలిపారు. ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తున్న విగ్రహాన్ని కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ అంశంపై అధికారుల తదుపరి చర్యలపై బాలానగర్ ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి సరైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహణ...




జడ్చర్ల//మార్చి 23 (ఆకాంక్ష) : జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ మెగా హెల్త్ క్యాంపులో వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, శిశు వైద్యం, కంటి వైద్యం, దంత వైద్యం, ఎముకల వైద్యం విభాగాలకు చెందిన వైద్యులు ప్రత్యేకంగా హాజరై రోగులను పరీక్షించి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఆరోగ్య సమస్యలతో వచ్చిన పలువురు రోగులకు తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి, తదుపరి చికిత్సపై మార్గనిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సక్రమంగా నిర్వహించబడింది. శిబిరం సందర్భంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఎక్కువ సంఖ్యలో హాజరై తమ ఆరోగ్య పరిస్థితులను పరీక్షించించుకున్నారు. ముఖ్యంగా సాధారణ జ్వరాలు, శ్వాసకోశ సమస్యలు, గర్భిణీల ఆరోగ్య పరీక్షలు, పిల్లల ఆరోగ్య తనిఖీలు, కంటి సమస్యలు, దంత సమస్యలు, ఎముకల నొప్పులతో వచ్చిన రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో గీతాంజలి, గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, డిప్యూటీ సర్పంచ్ మమతా మన్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే వార్డు సభ్యుడు రమేష్, మాజీ వార్డు సభ్యుడు బాలస్వామి, మాజీ ఎంపీటీసీ సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నరసింహాతో పాటు ఆస్పత్రి సిబ్బంది దేవయ్య, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇలాంటి మెగా హెల్త్ క్యాంపులు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని, ముఖ్యంగా పేద కుటుంబాలకు నిపుణులైన వైద్యులను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ ఆరోగ్య శిబిరంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో ఇలాంటి వైద్య శిబిరాలు తరచూ నిర్వహిస్తే ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేందుకు వీలు కలుగుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ మెగా హెల్త్ క్యాంపు మిడ్జిల్ మండల కేంద్రంలో ప్రజలకు ఉపయోగకరంగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు.

## మానసిక వైకల్యం గల వ్యక్తులకు సమాజం అండగా నిలవాలి...




నాగర్‌కర్నూల్//మార్చి 23 (ఆకాంక్ష) : రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ మరియు సెక్రటరీ ఆదేశాల మేరకు సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో "నాల్సా లీగల్ సర్వీసెస్ టు పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ ఏసిపి శ్రీరామ్ ఆర్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాట్లాడుతూ మానసిక వైఫల్యం చెందిన వ్యక్తుల పట్ల సమాజం సహృదయంతో వ్యవహరించి వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. వికలాంగుల హక్కుల చట్టం2016ను భారత పార్లమెంట్ ఆమోదించిందని, ఆ చట్టంలో పొందుపరిచిన హక్కులను అమలు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. వైకల్యం గల వ్యక్తుల వ్యక్తిగత గౌరవం, స్వేచ్ఛ, సొంత నిర్ణయాలకు ఎలాంటి వివక్ష చూపరాదని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తుల మధ్య ఉండే తేడాలను మానవ వైవిధ్యంలో భాగంగా స్వీకరించి గౌరవించాలని అన్నారు. వైకల్యం గల వ్యక్తులను హింసించడం, క్రూరంగా ప్రవర్తించడం, అవమానించడం, అగౌరవపరచడం వంటి చర్యలకు చట్టపరమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర అనుకోని ప్రమాదాల సమయంలో వైకల్యం గల వ్యక్తులకు ఇతరుల మాదిరిగానే రక్షణ, భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి ఓటు హక్కు కూడా సమానంగా ఉంటుందని, సంతానోత్పత్తి, కుటుంబ నియంత్రణ వంటి అంశాలపై సరైన సమాచారం, అవగాహన కల్పించాలని సూచించారు. వికలాంగులు తమ సమస్యలపై ఉచిత సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేసి సేవలు పొందవచ్చని, అలాగే ఇతర న్యాయ సమస్యలు, సందేహాలు, ఉచిత న్యాయ సలహాలు, సూచనల కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా మానసిక, మేధో వైకల్యం గల వ్యక్తుల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## షాద్‌నగర్‌లో మహిళ దారుణ హత్య...

### తల్లి శవం వద్ద రాత్రంతా మూడేళ్ల చిన్నారి రోదన...

### పోతుల శోభారాణి హత్యతో గ్రామంలో విషాదం...





షాద్‌నగర్//మార్చి 23 (ఆకాంక్ష) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తల్లి మృతదేహం వద్ద మూడేళ్ల చిన్నారి రాత్రంతా రోదిస్తూ గడిపిన హృదయ విదారక దృశ్యం గ్రామస్తులను కన్నీటి పర్యంతం చేసింది. మృతురాలు దేవునిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రంగారెడ్డిగూడకు చెందిన పోతుల శోభారాణి (30)గా గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం శోభారాణి పదేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ గ్రామానికి చెందిన రాజుతో వివాహం చేసుకుంది. మొదట్లో వారి వైవాహిక జీవితం సాఫీగా సాగినప్పటికీ, అనంతరం కుటుంబ విభేదాలు తలెత్తినట్లు తెలిసింది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన నర్సింహులుతో శోభారాణికి వివాహేతర సంబంధం ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయం భర్త రాజుకు తెలియడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవని సమాచారం. ఈ పరిణామాల మధ్య నెలరోజుల క్రితం శోభారాణి భర్త ఇంటిని విడిచిపెట్టి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వచ్చి ఉంటోందని తెలిసింది. ఆ తర్వాత నర్సింహులు ఆమెను వివాహం చేసుకుంటానంటూ కుల పెద్దల సమక్షంలో భర్తతో మాట్లాడినట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఈ వ్యవహారంతో ఆగ్రహానికి గురైన భర్త రాజు, శనివారం రాత్రి శోభారాణిని అత్యంత దారుణంగా హత్య చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హత్య అనంతరం మృతదేహాన్ని రంగారెడ్డిగూడ తంగెడుపల్లి రహదారి పక్కన చెట్ల పొదల్లో పడేసినట్లు సమాచారం. ఆదివారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. తల్లి మృతదేహం వద్ద మూడేళ్ల చిన్నారి రాత్రంతా ఉండి రోదిస్తూ గడిపిందనే విషయం తెలిసి గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి పరిస్థితి అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఈ ఘటనతో రంగారెడ్డిగూడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు దారితీసిన పూర్తి పరిణామాలు, బాధ్యులపై చర్యల విషయంలో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

## నాగర్ కర్నూల్‌లో ఘనంగా షాహిద్ దివస్ నిర్వహణ...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 23 (ఆకాంక్ష) : షాహిద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 95వ వర్ధంతిని నాగర్ కర్నూల్ పట్టణంలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన అమరవీరులని కొనియాడారు. వారి త్యాగాలు, ఆశయాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, యువత న్యాయం, సమానత్వం, దేశభక్తి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్నశేఖర్, రాజప్ప, మహమ్మద్, అశోక్ కుమార్, కొమురయ్య, శ్రీకాంత్ రెడ్డి, నందకిశోర్, రాములు, ఇందుమతి, ఊర్మిళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో

## వీర్లపల్లి శంకర్‌కు శుభాకాంక్షల వెల్లువ...

### కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం...




షాద్‌నగర్//మార్చి 23 (ఆకాంక్ష) : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా నియమితులైన షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆయనను ప్రత్యేకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో శంకర్‌ను శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో ఓబీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా శంకర్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు చేరువగా ఉండే నాయకుడిగా, సమస్యల పరిష్కారంలో అనుభవజ్ఞుడైన ప్రజాప్రతినిధిగా శంకర్ ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. పార్టీ బలోపేతంతో పాటు ముఖ్యంగా ఓబీసీ వర్గాల అభ్యున్నతి కోసం శంకర్ మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త బాధ్యతల్లో ఆయన సమర్థవంతంగా పనిచేసి పార్టీకి, ప్రజలకు విశేష సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ మరోసారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆప్యాయ వాతావరణంలో కొనసాగగా శంకర్‌కు పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు.

### మంథని జూనియర్ కళాశాల

## నూతన ప్రిన్సిపాల్ గా బాలోజీ...



మంథని//మార్చి 23 (ఆకాంక్ష) : మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా సోమవారం బాలోజీ పదవి బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ ప్రభుత్వ బాలుర కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్న బాలోజీ ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొంది బాధ్యతలు చెప్పటారు. ఇప్పటి వరకు ఇన్చార్జిగా మంథని బాలుర కళాశాల ప్రిన్సిపల్ ఉషా కొనసాగారు. ప్రిన్సిపల్ గా పదవీ బాధ్యతలు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, అందరి సహకారంతో కళాశాల అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ప్రిన్సిపాల్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని కృతజ్ఞతలు తెలియజేశారు.

## పాలెంలో 25న మెగా వైద్య శిబిరం...




నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 23 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 25వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ప్రభుత్వ 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాధారణ ఆస్పత్రి నుంచి స్త్రీరోగ, చిన్నపిల్లల, ఎముకలు-కీళ్ల, దంత, కంటి వైద్య నిపుణులతో పాటు జనరల్ ఫిజీషియన్‌లు శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సేవలు అందించనున్నారని చెప్పారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిపుణుల సలహాలు, చికిత్స పొందాలని డాక్టర్ ప్రియాంక సూచించారు.